


విద్యార్థుల్లో విద్యాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా సోమవారం 'శిక్షాసప్తాహ్' కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు 'ఎస్‌ఈపీ' ఆకారంలో కూర్చొన్నారు.

- అనంతసాగరం

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

మంగళవారం 23 జూలై 2024



జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రం



నిర్మలమ్మ కరుణించేనా!?

నేడు కేంద్ర బడ్జెట్

జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. పేరుకు అనేక ప్రాజెక్టులు నడుస్తున్నా నిధుల కొరతతో వాటిలో పురోగతి మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఎన్‌సీఈఆర్‌టీ, తెలుగు ప్రాచీన అధ్యయన కేంద్రం, పోర్టు అనుసంధానిత జాతీయ రహదారులు, విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్, రైల్వే ఫ్లైవోవర్లు.. ఇలా అనేక ప్రాజెక్టులకు నిధులు కేటాయించాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. ఎన్డీఏ కూటమిలో రాష్ట్ర ఎంపీల భాగస్వామ్యం చాలా కీలకమైన సమయంలో కేంద్రం ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇదే కావడం విశేషం. సాధారణ బడ్జెట్‌తోపాటు రైల్వే బడ్జెట్‌నూ అందులోనే ప్రవేశపెట్టనున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రాజెక్టులకు నిధులు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో ఆశలన్నీ కేంద్ర బడ్జెట్‌పైనే ఉన్నాయి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

● మెట్ట ప్రాంత వాసులను నడికూడి - శ్రీకాళహస్తి రైల్వే మార్గం ఊరిస్తూనే ఉంది. ఈ ప్రాజెక్టు ప్రారంభమై పుష్కరకాలం గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. ఆశించిన స్థాయిలో ఈ ప్రాజెక్టుకు నిధులు దక్కడం లేదు. జిల్లాలో భూసేకరణ కూడా పూర్తి కాలేదు. జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు ప్యాసెంజర్ రైలు కలగా మారింది. కృష్ణపట్నం - ఓబులాపురం రైల్వే పూర్తయి గూడ్సు రైళ్లు తిరుగుతున్నాయి. ఆ మార్గంలో ప్యాసెంజర్ రైళ్లు కూడా నడిపితే రాయలసీమ - నెల్లూరు ప్రాంతాలకు రాకపోకలు సులభమవుతాయి. దీనిపై ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లోనైనా నిర్ణయం వెలువడాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు. గూడూరు-విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ట్రాఫిక్ ఎక్కువైపోయింది. రైల్వే గేట్ల వద్ద ప్రజలు ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కీలకమైన ప్రాంతాల్లో రైల్వే ఫ్లైవోవర్‌లు నిర్మించాలని రెండేళ్ల క్రితం గతిశక్తి పథకంలో ప్రతిపాదించారు. కానీ అవి ముందుకు సాగలేదు. బడ్జెట్ లేమి కూడా ఇందుకు ఒక కారణంగా చెబుతున్నారు.



కృష్ణపట్నం - ఓబులాపురం రైల్వేలైన్



కృష్ణపట్నం పోర్టును అనుసంధానిస్తూ రవాణా సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు మూడేళ్ల క్రితం ప్రతిపాదనలు తయారు చేశారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో దాదాపు రూ.మూడు వేల కోట్లతో ఏడు జాతీయ రహదారులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రతిపాదించారు. ఈ రహదారులు పూర్తయితే జిల్లా పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. డీపీఆర్ సిద్ధమైనప్పటికీ నిధులు లేక ఈ ప్రాజెక్టులు ముందుకు సాగడం లేదు. ఇటు నెల్లూరు వరకు జాతీయ రహదారి -16ను ఆరు వరుసలుగా విస్తరించారు. కానీ నెల్లూరు - తడ మధ్య మాత్రం ఇంకా విస్తరణ జరగలేదు. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీనిపై కూడా గత కొంత కాలం నుంచి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందుతున్నాయి. అయితే ఈ ఏడాదైనా జాతీయ రహదారి విస్తరణకు కేంద్రం ఆమోదం తెలుపుతుందా.. అన్నది చూడాలి. విశాఖ-చెన్నై కారిడార్‌కు సంబంధించి నిధులు కేటాయింపులు జరిగితే పారిశ్రామిక అభివృద్ధికి మరిన్ని అడుగులు పడతాయి.

జాతీయ విద్యా పరిశోధన శిక్షణా మండలి (ఎన్‌సీఈఆర్‌టీ)కు వెంకటాచలం మండలం చౌటపాలెం వద్ద శంకుస్థాపన చేసి ఏడేళ్లు దాటింది. కానీ నేటికీ ఆ సంస్థకు పునాదులు కూడా పడలేదు. భూసేకరణ జరగకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే ఈ ఏడాది నుంచి నెల్లూరులో తాత్కాలిక భవనాల్లో ఎన్‌సీఈఆర్‌టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం నిధులు కేటాయిస్తే వెంకటాచలం వద్ద శాశ్వత భవనాల నిర్మాణం జరుగుతుంది. అలానే వెంకటాచలంలోని సరస్వతీనగర్‌లో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం కూడా ఇంకా పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. ఈ సంస్థకు కేటాయించిన భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి మాత్రమే కేంద్రం నిధులు ఇచ్చింది. శాశ్వత భవనాల ఏర్పాటుకై బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది.



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

'కామధేను'ను విస్మరించారా!?

- తొమ్మిదేళ్లయినా అభివృద్ధి ఊసేది!?
- ఎంత చేసినా పరిష్కారం కాని నీటి సమస్య
- సిబ్బంది కొరత.. ఉన్నవారిపై పనిభారం

దేశీయ ఆవులు, గేదెల పునరుత్పత్తి కోసం ప్రవేశపెట్టిన బృహత్తర పథకమిది. పాడిరైతుల పాలిట 'కామధేను'వుగా మారాల్సిన ప్రాజెక్టు నిధులలేమితో కునారిల్లుతోంది. ఎప్పుడో తొమ్మిదేళ్ల క్రితం రూ.25 కోట్లు మంజూరవగా, ఆ తర్వాత పైసా కూడా ఇటు రాష్ట్రం, అటు కేంద్రం విదల్చలేదు. దీంతో పథకం ఫలాల మాట అటుంచితే, సమస్యలు తిష్ఠవేసి ఉన్నాయి.



కొండాపురం, జూలై 22 : చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో 2015లో అప్పటి ఎన్డీయే కూటమి జాతీయ కామధేను పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.250 కోట్లు కేటాయించి తొలివిడతగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. దీంతో అప్పటి పాలకులు, అధికారులు చకచకా కామధేను పునరుత్పత్తి కేంద్రం పనులు మొదలుపెట్టారు.

● దేశీయ జాతి పశువుల అభివృద్ధే లక్ష్యం

స్వదేశీ జాతులకు చెందిన ఆవులు, గేదెల అభివృద్ధే లక్ష్యంగా ఈ పథకాన్ని దేశంలోనే రెండవది గా, దక్షిణ బారతంలో మొదటిదిగా చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో అధిక పాల దిగుబడి ఇచ్చే ఆవులు, గేదెలను ఇక్కడకు తీసుకువచ్చి వాటిని పునరుత్పత్తి చేసి అతితక్కువ ధరకు రైతులకు అందించాలనేది ఈ పథకం ప్రధాన ఉద్దేశం.

● కేంద్రంలో 544 పశువులు

తొలిగా మంజూరైన నిధులతో పశువుల షెడ్లు, సిబ్బందికి క్వార్టర్స్ తదితర భవనాలు నిర్మించారు. దేశం నలుమూలల నుంచి సుమారు 20 రకాల ఆవులు, గేదెలను కొనుగోలు చేశారు. కామధేను కేంద్రంలో 14 రకాల స్వదేశీ మేలుజాతి ఆవులు, 5 రకాల గేదెలు ఉన్నాయని ప్రాజెక్టు జేడీ వెంకటేశ్ చెబుతున్నారు. వీటి నుంచి వీర్యం సేకరించి స్థానికంగా మేలుజాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నామన్నారు. ఈవిధంగా పుట్టబోయే దూడలు పెద్దవి అయ్యాక అధిక పాలను ఇస్తాయన్నారు.

● తాజా ప్రతిపాదనలకు మోక్షం

పశువులకు అదనపు షెడ్ల నిర్మాణాలు, మెటీరియల్ నిల్వ ఉంచేందుకు గోదాములు, సైలేజ్ కోసం బంకర్లు ఏర్పాటుకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.3.26 కోట్ల నిధులు మంజూరు చేసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెండర్ ప్రక్రియ జరగాల్సి ఉందని జేడీ వెంకటేష్ తెలిపారు. మరోవైపు కేంద్రంలో పశువులకు అవసరమైన దాణా రెండు, మూడు నెలలకు ఒకసారి సరఫరా అవుతుండేది. ఇటీవల ప్రతి నెలా సరఫరా జరుగుతోంది. కేంద్రంలోని ఆవులు, గేదెల పాల అమ్మకం ద్వారా ప్రతినెల దాదాపు ఒక లక్ష రూపాయల వరకు నగదు వస్తోంది.

● సిబ్బంది కొరత

కామధేను కేంద్రంలో ఒక జేడీ, ముగ్గురు ఏడీలు ఉన్నారు. సీనియర్ అసిస్టెంటు లేరు. ఆరుగురు ఎల్ఎస్ఏలు ఉండాల్సి ఉండగా నలుగురే ఉన్నారు. ఆరుగురు వీఏఏలు ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఇక రోజువారీ కూలీలు 47 మందికిగాను 37 మంది ఉన్నారు. వీరికి రోజుకు రూ 500 కూలి ఇస్తున్నారు. కామధేను ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా స్థానికంగా లభిస్తాయని సంబరపడ్డ నిరుద్యోగులు ఇప్పుడు డీలా పడుతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారే తప్ప పర్మినెంటు ఉద్యోగ అవకాశం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు.

వేధిస్తున్న నీటిసమస్య

ఎంతో బృహత్తర ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి నీటిని తరలించేందుకు ఆర్ఐడీఎఫ్ పథకం కింద 2017లో రాళ్లపాడు రిజర్వాయరు నుంచి నీటిని తరలించేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. పనులు మొదలై దాదాపుగా సగం వరకు పూర్తయ్యాక అనివార్య కారణాలతో ఆగిపోయాయి. అనంతరం మండల పరిధిలోని మర్రిగుంట చెరువు నుంచి నీటిని తరలించేందుకు రూ3.20 కోట్లను మంజూరు చేశారు. పనులన్నీ దాదాపుగా పూర్తయినా కేంద్రానికి మాత్రం నీరు చేరలేదు. చెరువు నుంచి పైపులైన్ ద్వారా తీసుకొచ్చిన నీటిని కేంద్రంలో నిర్మించిన స్టోరేజీ ట్యాంకుల్లో నిల్వ ఉంచి పశువులకు వాడుకోవాల్సి ఉంది. అయితే, కామధేను కేంద్రంలో వేసిన బోర్ల నీరు రోజువారీ అవసరాలకే సరిపోతోంది. ఇక పశుగ్రాసం పెంచేందుకు కొత్తగా బోర్లు వేయాల్సిన అవసరం ఉంది.

బారాషహీద్ దర్గాకు తరగని రద్దీ



నెల్లూరు(సాంస్కృతికం), జూలై 22 : నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగకు భక్తుల రాక కొనసాగుతోంది. ఆదివారమే పండుగ ముగిసినా మరో రెండు రోజులపాటు భక్తుల రాక ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. స్వర్ణాల చెరువులో పవిత్ర స్నానాలు చేసి వరాల రొట్టెలను అందుకుంటున్నారు. ఆ తర్వాత దర్గాలోని బారాషాహిదులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నగరపాలక శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు, మంచినీటి సరఫరా కొనసాగుతోంది. దర్గా కమిటీ ఛైర్మన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో భక్తులకు కమిటీ సభ్యులు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ దర్గాను పర్యవేక్షించారు.





'పట్ట'లతో సురక్షితమేనా!

నెల్లూరు ఆర్డీవో కార్యాలయ చిత్రాలివి. బ్రిటీష్ కాలం నాటి భవనాలు కావడంతో వానకు తడుస్తున్నాయి. దీంతో అధికారులు భవనంపైకప్పు మీద టార్పాలిన్ పట్టలు కప్పి ఇదిగో ఇలా రక్షణ కల్పించుకున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నెల్లూరు

భారీ వర్షాలొస్తున్నాయ్.. జాగ్రత్త!

- ముందస్తు చర్యలకు సన్నద్ధం కండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 : జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆనంద్ సూచించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువుల స్థితిగతులను పరిశీలించి అవసరమైన చోట్ల కట్టలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్, డీఆర్‌ఓ లవన్న, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

● మహిళా గౌరవ పోస్టర్ ఆవిష్కరణ

పని చేసే ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తూ వారి గౌరవాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు తయారు చేసిన గోడపత్రికలను కలెక్టర్ ఆనంద్ ఆవిష్కరించారు. కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ, డీఆర్వోతోపాటు ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నిర్లక్ష్యం వహించే తహసీల్దార్లను రిలీవ్ చేయం

● వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), జూలై 22 : రెవెన్యూ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే తహసీల్దార్లను రిలీవ్ చేసే ప్రసక్తే లేదని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ శంకరన్ సమావేశ మందిరం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన సమీక్షించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించి పురోగతి చూపించాలని ఆదేశించారు. ప్రధానంగా కుల ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా మంజూరు చేయాలని, ఏ కారణం లేకుండా సర్టిఫికెట్లను తిరస్కరించవద్దని సూచించారు. రాపూరు, బోగోలు మండలాల్లో ఎక్కువగా రెవెన్యూ సర్టిఫికెట్లు పెండింగులో ఉన్నాయని, మ్యూటేషన్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎల్‌పీఓలు, ఎంపీడీవోలు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. కాలువల్లో పూడికతీత, పరిశుభ్రత కార్యక్రమాలను నిరంతరం మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుద్ధ్యం పనుల విషయంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● నేటి నుంచి ఆధార్ క్యాంపులు

మంగళవారం నుంచి ఈ నెల 27వ తేదీ వరకు జిల్లాలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. చిన్నపిల్లలకు నూతన ఆధార్ కార్డుల జారీ, 5 నుంచి 15 ఏళ్ల వయసుగల వారికి ఆధార్ బయోమెట్రిక్, 18 సంవత్సరాల వయసు పైబడిన వారికి ఆధార్ అప్‌డేషన్ చేయించాలన్నారు. జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా ఆధార్ కార్డులకు నోచుకోని 10వేల మంది ఎస్టీ లకు ఆధార్ కార్డులు ఇవ్వడానికి సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ సేధుమాధవన్, డీఆర్‌ఓ లవన్న, జడ్పీ సీఈఓ కన్నమ నాయుడు, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఈఏపీసెట్ తుది కౌన్సెలింగ్

నెల్లూరు (విద్య), జూలై 22 : ఏపీ ఈఏపీ సెట్-2024 తుదికౌన్సెలింగ్‌ను మంగళవారం నుంచి 27వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కౌన్సెలింగ్ అడ్మిన్ దంపూరి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఓపెన్‌స్కూల్లోని ఓసీకి 44.5 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 39.5 శాతం కంటే ఎక్కువ ఉన్నవారికి అర్హత ఉంటుందన్నారు. ఫీజులు కట్టని వారు మాత్రమే ఈ కౌన్సెలింగ్‌లో ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ రుసుములను 25వ తేదీ లోపల పూర్తి చేయాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే మాత్రమే హెల్ప్‌లైన్ సెంటర్‌లో హాజరు కావాలన్నారు. తొలి కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు మరో సీటును, కళాశాలలను మార్చుకునేందుకు ఆప్షన్లు పెంచుకోవచ్చన్నారు. ఈ నెల 24 నుంచి 26వతేదీ వరకు ఆప్షన్ల ప్రక్రియకు అవకాశం ఉందన్నారు. 27న ఫ్రీజ్ చేసిన ఆప్షన్‌లలో మార్చుకునే అవకాశం ఉందన్నారు. తొలి కౌన్సెలింగ్‌లో కళాశాలలో సీటు పొంది, నచ్చని విద్యార్థులు ఈ తుది కౌన్సెలింగ్‌లో ఆప్షన్‌ను నమోదు చేసుకోవచ్చన్నారు. సర్టిఫికెట్లను పరిశీలించిన తరువాత సీటు రాని వారు ఈ ఆప్షన్స్‌ను నమోదు చేయవచ్చన్నారు.

జిల్లావాసికి రైల్వే అవార్డు

- కొమ్మరపూడి పాయింట్‌యన్ ఎంపిక
- రైల్వే జీఎం నుంచి అవార్డు అందుకున్న దినేష్



దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ నుంచి అవార్డు అందుకుంటున్న దినేష్

నెల్లూరు (వెంకటేశ్వర పురం), జూలై 22 : జిల్లాలోని కొమ్మరపూడి రైల్వేస్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్ మన్‌గా పనిచేస్తున్న ఎన్ దినేష్‌కు ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్ సేఫ్టీ అవార్డు దక్కింది. విధుల్లో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నుంచి రక్షించిన రైల్వే ఉద్యోగులకు ఈ అవార్డు అందజేస్తారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఈ అవార్డులను ప్రదానం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లలో జూన్ నెలకుగాను 9 మందికి అవార్డులను అందజేశారు. విజయవాడ డివిజన్ పరిధిలోని నెల్లూరు జిల్లా కొమ్మరపూడి రైల్వే స్టేషన్‌లో అసిస్టెంట్ పాయింట్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ దినేష్‌కు ఈ అవార్డు అందజేశారు. జూన్ 26న బిట్రగుంట - అల్లూరు రోడ్డు మధ్య ఎల్‌సీ నెం.143టీలో గూడ్స్ రైలు లోకో నుంచి 24వ వ్యాగన్ చక్రం కదలకుండా కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని బిట్రగుంటలో డ్యూటీ స్టేషన్ మాస్టర్‌కు దినేష్ తెలియజేశారు. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలును ఆపి మరమ్మతులు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాన్ని నివారించినందుకు దినేష్‌కు ఈ అవార్డు వరించింది.

ఫోర్జరీ కేసులో నిందితుల కోసం

పోలీసుల గాలింపు

● త్రుటిలో తప్పించుకున్న మేయర్ భర్త?

నెల్లూరు (క్రైం), జూలై 22: నెల్లూరు కార్పొరేషన్‌లో కమిషనర్ వికాస్‌మర్మత్ సంతకం ఫోర్జరీ కేసులో పోలీసులు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో ఆరుగురిని నిందితులుగా చేర్చారు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకొని గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు తిరుపతి, బెంగళూరు, చెన్నై తదితర ప్రాంతాల్లో ఉన్నారంటూ సమాచారం అందుకున్న పోలీసులు ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బృందాలను పంపినట్లు సమాచారం. చెన్నైలోని ఓ హోటల్‌లో మేయర్ భర్త పోట్లూరి జయవర్ధన్ ఉన్నట్లు నిర్ధారించుకున్న పోలీసులు అక్కడ రైడ్ చేయగా, ఆయన త్రుటిలో తప్పించుకొని వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. అయితే చెన్నై పరిసర ప్రాంతాల్లో జయవర్ధన్ ఉన్నాడని నిర్ధారించుకున్న పోలీసులు ఆ ప్రాంతాల్లో విస్తృతంగా గాలిస్తున్నట్లు సమాచారం. ఆయనతోపాటు ప్రధాన అనుచరుడు శివకృష్ణ సైతం చెన్నై పరిసర ప్రాంతాల్లోనే ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇద్దరిని త్వరలోనే అదుపులోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

జలదంకి బస్టాండ్‌లో యాచకుడి మృతి


బస్టాండ్ ఆవరణలో మృతి చెందిన యాచకుడు

జలదంకి, జూలై 22: జలదంకి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందగా సోమవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి ఖాజామొహుద్దీన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో హిందూ శ్మశాన వాటికలో మృతదేహాన్ని ఖననం చేశారు.

అడ్వాన్స్ నగదు అడిగాడని దాడి

కావలిరూరల్, జూలై 22: లారీకి డ్రైవర్‌గా పనిచేస్తానని అడ్వాన్స్‌గా నగదు తీసుకుని, పనికి రాకపోవటంతో ఆ నగదు అడిగినందుకు రాయితో దాడి చేశాడు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు, శింగరాయకొండకు చెందిన కట్టా బ్రహ్మయ్యకు చెందిన బాతుల లారీకి డ్రైవర్‌గా పనిచేస్తానని కావలి బాలక్రిష్ణారెడ్డినగర్‌కు చెందిన పాలకీర్తి మధు రూ.30వేలు తీసుకున్నాడు. వైద్యశాల సమీపంలో ఆ నగదు అడిగినందుకు మద్యం మత్తులో రాయి తీసుకుని బ్రహ్మయ్యపై దాడి చేశారు. గాయపడిన బ్రహ్మయ్యను ఏరియా వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్పించారు. వన్‌టౌన్ పోలీస్‌లు కేసు నమోదు చేశారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత


పోలీసులు పట్టుకున్న చికెన్ వ్యర్థాలు తరలించే వాహనం

సంగం, జూలై 22: మండలంలోని గాంధీజన సంఘం వద్ద ముంబాయి జాతీయ రహదారిపై వెళ్తున్న చికెన్ వ్యర్థాలను తరలించే వాహనాన్ని సోమవారం సంగం పోలీసులు పట్టుకున్నారు. వ్యర్థాలను డ్రమ్ముల్లో వేసుకుని లారీలో వస్తుండగా మార్గమధ్యలో గాంధీజనసంఘం వద్ద లారీలో నుంచి ఓ డ్రమ్ములోని చికెన్ వ్యర్థాలు కింద పడిపోయాయి. దీంతో రహదారి అంతా చికెన్ వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి సంఘటనా స్థలం వద్దకు వెళ్లి చికెన్ వ్యర్థాలు ఉన్న లారీని, సిబ్బందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. చికెన్ వ్యర్థాలను సంగం కొండ మలుపు వద్ద గుంతలు తీసి చికెన్ వ్యర్థాలు అందులో వేసి పూడ్చి వేయించారు.

డీసీఎంఎస్ ఉద్యోగిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 22: నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీలో సేల్స్‌మన్ కమ్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగిపై నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ రిటైల్ ఫెర్టిలైజర్ షాపు ఉంది. అందులో నిరంజన్‌రెడ్డి సేల్స్‌మన్ కమ్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎరువుల విక్రయ తాలుకు రూ.7,49,524 నగదు దుర్వినియోగమైనట్లు రికార్డుల వెరిఫికేషన్‌లో వెలుగులోకి వచ్చింది. దీంతో అధికారులు నిరంజన్ రెడ్డిని గట్టిగా ప్రశ్నించగా రూ.3.50 లక్షలు నగదు చెల్లించారు. మిగిలిన రూ.3,99,524 చెల్లించలేదు. పలు దఫాలు హెచ్చరించినా సమాధానం లేకపోవడంతో నిరంజన్‌పై చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి వెంకటస్వామి ఇటీవల నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తప్పుడు క్లెయిమ్స్ ఫైల్ చేస్తే చర్యలు

● ఆదాయపు పన్ను శాఖ జేసీ వంశీధర్



సదస్సులో మాట్లాడుతున్న వంశీధర్

నెల్లూరు (హరనాథపురం), జూలై 22: ఆదాయపన్ను రీఫండ్ కోసం తప్పుడు క్లెయిమ్స్ ఫైల్ చేస్తే చర్యలు తప్పవని ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్ అన్నారు. సోమవారం నగరంలో జరిగిన సదస్సులో నెల్లూరు, తిరుపతి కమిషనరేట్ పరిధిలో గత సంవత్సరం ఆదాయపు పన్నుకు సంబంధించి తప్పుడు రిఫండ్ క్లెయిమ్స్ 124 శాతం పెరిగాయన్నారు. వీటి మీద తమ శాఖ సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఈ నోటీసుల ద్వారా 11వేల మంది మళ్లీ కొత్తగా రిటర్నులు ఫైల్ చేసి రూ.150కోట్లు తిరుపతి కమిషనరేట్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించారన్నారు. ఇకపై ఇలాంటి తప్పుడు క్లెయిమ్ చేస్తే పెనాల్టీలు, ప్రాసిక్యూషన్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ శరత్‌బాబు, అధికారులు ప్రసాద్‌బాబు, సందీప్‌కృష్ణ, నెల్లూరు జిల్లా చార్టెడ్ అకౌంటెంట్లు, డ్రాయింగ్, పంపిణీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో 9.719 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 22: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి డ్యాంలో 9.719 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 22: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతుండిన ఓ వ్యక్తి సోమవారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతికి చెందిన రవికుమార్(40) కొంతకాలంగా నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి గుడి సమీపంలోని పోలీసు కాలనీలో నివాసం ఉంటూ, నిప్పో సెంటర్ వద్ద సెలూన్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆయన ఈనెల 21వ తేదీన బుజబుజనెల్లూరుకు వెళ్లి తూర్పువైపు నుంచి పడమర వైపునకు జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై వైపు నుంచి నెల్లూరు వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో రవికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ఏకే నగర్‌లో నివాసం ఉంటున్న మృతుడి బావమరిది వెంకటసుబ్బయ్య సౌత్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	135
లేయర్ లైవ్	105
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	265
లేయర్	178

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6964
వెండి కిలో ధర	రూ. 91,000
వెండి ఒక గ్రాము	రూ. 93.00

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు

● కలెక్టరేట్‌కు తరలివచ్చిన ప్రజలు ● సమస్యలపై అర్జీల అందజేత


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 22: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చి కలెక్టర్ ఆనంద్‌కు అర్జీలు అందజేశారు. భూసమస్యలు, తాగునీటి సమస్య పరిష్కరించాలని కొందరు, భూములు, స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇప్పించాలని మరికొందరు అర్జీలు సమర్పించారు. అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సమస్యలను క్షుణ్ణంగా చదివి సంబంధిత అధికారులను పిలిపించి పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

● హోమియోపతి వైద్యశాలను పునః ప్రారంభించాలి: బీజేపీ

నగరంలోని 47వ వార్డు కామాటి వీధిలో హోమియో వైద్యశాలను పునః ప్రారంభించాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఆ వీధిలో హోమియో వైద్యశాల ఉండేదని, కొన్ని కారణాలతో దానిని తీసేశారన్నారు. స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఆ వైద్యశాలను పునఃప్రారంభించాలని కోరారు.

● మసీదుల మరమ్మతులు చేపట్టాలి : ముస్లిం ఫెడరేషన్

నెల్లూరు నగరంలోని మసీదులకు మరమ్మతు పనులను చేపట్టాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు జియా ఉల్ హక్, జేఏసీ రాష్ట్ర నేత ఆఫిష్ పాషా, జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్ అజీజ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో 27 మసీదులకు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, ఎన్నికల కోడ్‌తో పనులు ప్రారంభం కాలేదన్నారు.

● భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

నెల్లూరు(వైద్యం) : జిల్లాలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు వినతిపత్రం అందచేశారు. ఈ సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఇసుక పాలసీ వల్ల ఆరు నెలలు కార్మికులు పనులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇల్లు నిర్మించుకునే వారు సెస్ రూపంలో కార్మికుల సంక్షేమ బోర్డు వేసిన రూ.2వేల కోట్లు స్వలాభం కోసం గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దారి మళ్లించారన్నారు. ఇప్పటికైనా కార్మికుల సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలన్నారు. జీవో నెంబర్ 1214ను రద్దుచేసి ఇసుక క్వారీలు ప్రారంభించాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు పెన్షన్ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నేతలు సూర్యనారాయణ, చాన్‌బాషా, శ్రీనివాసులు, షమిముల్లా, సంపూర్ణమ్మ, కార్తీక్, శీనయ్య, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.

రైతులకు శాపం.. వెబ్‌ల్యాండ్-2

● రికార్డులో వివరాలున్నా ఫలితం సున్నా..
● రుణాల మంజూరుకు బ్యాంకర్లు ససేమిరా..
● దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

అల్లూరు, జూలై 22: భూముల రీసర్వే అనంతరం తీసుకువచ్చిన వెబ్‌ల్యాండ్-2 రైతులపాలిట శాపంగా పరిణమించింది. రికార్డుల్లో పేర్లు, భూ వివరాలు ఉన్నా ఫలితం లేకుండా పోయింది. గతంలో భూములపై వ్యవసాయం రుణం పొందాలంటే రైతులకు భూ యాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాసుపుస్తకం ఉంటేచాలు. అయితే గత వైసీపీ ప్రభుత్వం భూశాశ్వతహక్కు అంటూ తీసుకువచ్చిన పథకం వల్ల రైతులకు ఫలితం దక్కకపోగా, అదికాస్తా సమస్యలా మారింది. జిల్లాలో 10 లక్షల ఎకరాల పైచిలుకు భూములు ఉండగా, అందులో 70శాతం భూమిని రీసర్వే చేసి సర్వే రాళ్లు నాటారు. ఇందుకు రూ.వేల కోట్లు ఖర్చుచేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని రైతులు అంటున్నారు. వెబ్‌ల్యాండ్ అంటూ గత ప్రభుత్వం ప్రత్యేక సైట్‌ను ఏర్పాటు చేసి అందులో సర్వేనెంబర్ల ద్వారా హక్కుదారులను నిర్ధారించింది. వారి పేర్లు సర్వేనెంబర్లతో ఒక ఖాతా నెంబరును అనుసంధానం చేసి వారికి అడంగల్, 1బీ రికార్డులతోపాటు పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసింది. వాటి ఆధారంగా రైతులకు అవసరమైన రుణాలు, రాయితీ పథకాలు అందేవి. నేడు వాటితో ఎలాంటి ఉపయోగం లేదని అంటున్నారు. వెబ్‌ల్యాండ్ -2 రికార్డుతో పూర్తిస్థాయి హక్కులు వస్తాయని భావించిన రైతులకు వీటి ద్వారా రుణాలు పొందలేమని తెలియడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు.

● రుణాలు ఇవ్వలేమంటున్న బ్యాంకర్లు

రీసర్వే అనంతరం మంజూరు చేసిన పాసుపుస్తకంతో రుణాలు ఇచ్చేది లేదని బ్యాంకర్లు స్పష్టంగా చెప్తున్నారు. కొత్తగా వచ్చిన పట్టాదారు పాసుపుస్తకంతో తమ బ్యాంకుకు రావద్దని వారు తేల్చి చెప్తున్నారు. దీంతో రైతులు ఖంగు తింటున్నారు. వెబ్‌ల్యాండ్ -1లో వివరాలు లేకుండా నూతనంగా రీసర్వే ద్వారా వచ్చిన వెబ్‌ల్యాండ్-2లో రికార్డులు ఉన్నా రుణాలు మంజూరుకు ససేమిరా అంటున్నారు.

● రుణం వస్తుందా... రాదా ?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాలన ప్రక్షాళనలో భాగంగా వెబ్‌ల్యాండ్-2 రికార్డుపై నిర్ణయం తీసుకుంటుందనే ఆశతో రైతులు ఉన్నారు. ఇది సాధ్యమా అసాధ్యమా అనే అంశంపై పూర్తిస్థాయి నిర్ణయాన్ని ఇంకా ప్రకటించలేదు. రెవెన్యూశాఖలో వెబ్‌ల్యాండ్ -2 రికార్డును సైతం రద్దు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి.

రీసర్వేతో అయోమయం



రీసర్వేతో రైతులను అయోమయానికి గురిచేశారు. గతంలో ఉన్న వెబ్‌ల్యాండ్-1 ద్వారా రుణాల మంజూరు సజావుగా జరిగేవి. వెబ్‌ల్యాండ్ -2లో సమస్యలు చోటు చేసుకోవడంతో బ్యాంకర్లు రుణాలను నిరాకరిస్తున్నారు. ఈ సమస్యలను రుణాల మంజూరుకు రైతులకు అవకాశం లభించేలా ప్రభుత్వం చొరవ చూపాలి.

-రామిశెట్టి కృష్ణ చైతన్య, రైతు, అల్లూరు

ఆ పాసు పుస్తకాలు రుణాలకు పనికిరావు



రీసర్వే అనంతరం మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు రుణాలు పొందేందుకు ఉపయోగపడవు. దీంతో అవి దేనికీ పనికి రాకుండా పోయాయి. గతంలో పట్టాదారు పాసుపుస్తకం అంటే ఎంతో విలువ కలిగి ఉండేది. జగనన్న ఫొటో ఉన్న పుస్తకాన్ని ఏ బ్యాంకరూ దగ్గరికి కూడా రానివ్వడం లేదు. వాటిని మంజూరు చేయడం ఎందుకు ?

- పోలిశెట్టి శ్రీనివాసులు, ఉలవపాళ్ల, దగదర్తి మండలం

పంట కాలువల్ని ఆక్రమించి లేఅవుట్లు

● రూ. కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాల కబ్జా
● సర్వే చేసి ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు


లేఅవుట్‌లో ఆక్రమించి ఉన్న పంటకాలువను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

కావలి, జూలై 22: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి ఏర్పాటు చేసిన లేఅవుట్లలోని అక్రమాలను అధికారులు వెలికి తీస్తున్నారు. పట్టణంలోని జాతీయ రహదారికి తూర్పున దళితకాలనీకి ఉత్తరం వైపున వేసిన లేఅవుట్లలో ఆక్రమించిన కాలువలను సర్వే చేసి గుర్తించి, సోమవారం నాలుగు ఎక్స్‌కవేటర్లతో వాటిని తవ్వటం ప్రారంభించారు. ఆ లేఅవుట్‌లో ఒకటిన్నర కిలోమీటరు పొడవు, 3మీటర్ల వెడల్పు ఉన్న మూడు కాలువలను ఆక్రమించి వాటిపై రోడ్లు, లేఅవుట్లు వేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అండదండలతో వైసీపీ నాయకులు ప్రభుత్వ కాలువలను పూడ్చివేసి, లేఅవుట్‌లు వేశారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు లేఅవుట్లలో సర్వే చేపట్టారు. గత నెలరోజులుగా సర్వే చేసి ప్రభుత్వ ఆస్థులు గుర్తించారు. అయితే మార్కింగ్ చేస్తూ స్వాధీన పరుచుకోకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. 120ఎకరాల వరకు ప్రభుత్వ భూములను రియల్టర్లు ఆక్రమించారని, వాటి వివరాలతో సహ రైతులు, ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు అధికారులు చేసిన సర్వేలో సుమారు 60 ఎకరాల వరకు గుర్తించినా వాటిని స్వాధీనపరు చుకోలేదనే ఆరోపణలున్నాయి. అయితే సోమవారం నుంచి ఆక్రమించిన కాలువలను వెలికితీస్తున్నారు.

ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

● ఎస్పీ కృష్ణకాంత్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), జులై 22: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు అధికారులకు ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదేశించారు. సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 63ఫిర్యాదులు అందాయి. వాటిని స్వీకరించిన ఎస్పీ బాధితుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'జొన్నవాడ' ఆలయంపై నివేదికివ్వండి

● ఈవోను ఆదేశించిన కలెక్టర్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 22 : జొన్నవాడలోని మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయానికి సంబంధించి అన్ని విషయాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారని ఆ ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి సోమవారం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన 'జొన్నవాడ ఆలయ ఖజానా ఖాళీ?' వార్తకు సంబంధించి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు నివేదిక కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు ఈవో తెలిపారు.

● దాతల విరాళాలపైనా ఆరా

కామాక్షితాయి ఆలయంలో పలు పూజలు, అభివృద్ధి పనులపేరుతో దాతల నుంచి సేకరించిన విరాళాలపై వివరాలు ఇవ్వాలని కోరుతూ మాజీ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, అర్చకుడు శ్రీశైలం గిరిధర్‌లకు నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ విషయమై ఆలయ ఈవోను వివరణ కోరగా గత నెల 10న నోటీసులు జారీ చేసింది వాస్తవమేనని అన్నారు.

ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను పునరుద్ధరించాలి

● దళిత సంఘర్షణ సమితి ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దళిత సంఘర్షణ సమితి నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూలై 22 : ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్‌లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి మాట్లాడుతూ వాటిని పునఃప్రారంభించి దళిత, గిరిజన యువకులకు రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. వైసీపీ పాలనలో దళిత, గిరిజన కార్పొరేషన్‌లు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని తెలిపారు. కోట్లాది రూపాయలను అమ్మఒడి, ఇతర కాంట్రాక్టర్లకు మళ్లించారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే ఎన్ఎస్ఎఫ్‌డీసీ నిధులతో కోట్లాది రూపాయాల భూమి కొనుగోలు పథకాలు అమలు జరిగాయని చెప్పారు. కార్లు, ట్రాక్టర్లు, వందలాది మందికి ఆటోలు ప్రతి సంవత్సరం ఇచ్చే వారన్నారు. వైసీపీ పాలనలో 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారని ఆరోపించారు. ఆ కార్పొరేషన్‌లను పునరుద్ధరించి యువతకు రుణ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.

విద్యాభివృద్ధికే 'శిక్షాసప్తాహ్'

● ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి



స్టాళ్లను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు (విద్య), జూలై 22: విద్యార్థుల్లో విద్యాభివృద్ధిని పెంపొందించేందుకే శిక్షాసప్తాహ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.ఉషారాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నెల్లూరులోని వైఎస్ఆర్ నగర్‌లో ఉన్న మండల ప్రజాపరిషత్ పాఠశాలలో జిల్లా స్థాయి విద్యావారోత్సవాలు (శిక్షా సప్తాహ్) ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ వరకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేశామన్నారు. ఈ కార్యక్రమాల కార్యనిర్వహణ, అమలు పరిచే విధివిధానాలను ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు తెలియచేశామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాలను పరిశీలించి విద్యార్థులకు అర్థమయ్యేలా వాటిని వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుధీర్ బాబు, సీఎంఓ పెంచలయ్య, ఎంఈఓ-2 మురళీధర్, ప్రధానోపాధ్యాయురాలు ఎ.విజయకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు నీటిపై అభ్యంతరాలు

బిట్రగుంట, జూలై 22: గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నాడు- నేడు పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ల తాగునీరు రుచిగా లేవని విద్యార్థుల తల్లితండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. బోగోలు మండలంలో నాడు-నేడు కింత మొదటి విడతలో 17 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిల్లో ఆర్వో ప్లాంట్లను ఆర్భాటంగా ప్రారంభించినా, మరమ్మతుల విషయంలో పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అవి పనిచేయకపోతే హెచ్‌ఎంలకు తలభారంగా మారింది. విద్యార్థులకు తాగునీరు అందించేందుకు ఉపాధ్యాయులే సొంత నిధులతో మరమ్మతులు చేయించుకుంటున్నారు. బోగోలు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇటీవల సొంత నిధులతో ఆర్వో ప్లాంటును బాగుచేయించినట్లు తెలిసింది. అలాగే విశ్వనాథరావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 2022-23లో నాబార్డు నిధుల కింద ఏర్పాటు చేసిన ఆర్వోప్లాంట్ 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. ప్లాంటు మెమరిన్లు దెబ్బతిన్నాయని వాటిని మార్చేందుకు వారం పట్టవచ్చని అధికారులు తెలిపారు. పాతబిట్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లను పరిశీలించి, మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


నాడునేడు కింద ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు

నిందితుడికి ఆరు నెలల జైలు

ఉదయగిరి రూరల్), జూలై 22: రోడ్డు ప్రమాదంలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆరు నెలలపాటు జైలుశిక్ష రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య సోమవారం తీర్పు ఇచ్చారు. వివరాల మేరకు.. 2016న చేజర్ల మండలం కొల్లపునాయుడుపల్లికి చెందిన రావిళ్ల శివరామయ్య, ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లికి చెందిన పెట్లూరి కౌశిక్‌లు మండలంలోని వెంకటంపేట వద్ద జరుగుతున్న ఆంజనేయస్వామి ఉత్సవాలకు వచ్చి తిరిగి వెళుతున్నారు. ఈ క్రమంలో దుత్తలూరు నుంచి కడప జిల్లా బద్వేల్‌కు బొగ్గు లోడుతో వెళుతున్న లారీ మండలంలోని నందిపాడు సెంటర్‌లో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటనపై అప్పట్లో కేసు నమోదైంది. విచారణలో డ్రైవర్ గజ్జి రాజేష్ అతివేగంగా వాహనాన్ని నడిపి వారి మృతికి కారణమయ్యారని నేరం రుజువైంది.

భూకబ్జాలు కట్టడయ్యేనా?

- ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- నామమాత్రంగా అధికారుల చర్యలు



అనంతసాగరం చెరువు లోతట్టులో వెలసిన నిర్మాణాలు



మంచాలపల్లి వద్ద ఆక్రమించిన భూమిలో ఏర్పాటు చేసిన బోర్డు

అనంతసాగరం, జూలై 22: మండలంలో భూ కబ్జాదారుల పరంపర కొనసాగుతోంది. చెరువైనా.. కుంటైనా.. గట్టైనా.. కొండైనా అది సర్కారు భూమి అయితే చాలు దున్నేస్తున్నారు. సోమశిల జలాశయం ఉత్తర కాలువ అందుబాటులోకి రావడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఎకరా రూ.4 లక్షల నుంచి రూ.10లక్షల వరకు ధర ఉంది. దీంతో ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు వదలడం లేదు. ఖాళీస్థలాలు ఆక్రమించడంతో పాటు అగ్రిమెంట్ల రూపంలో క్రయవిక్రయాలు జరుపుతున్న పరిస్థితి నెలకొంది. ఇటీవల మంచాలపల్లి వద్ద రెండెకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి పొలంగా మార్చినట్లు రెవెన్యూ అధికారులు ఫిర్యాదు అందడంతో దాన్ని అడ్డుకొని బాధిత వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఆ స్థలంలో ఎవరూ ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డు పెట్టారు. ఎన్నికల సమయంలో బొమ్మవరం పంచాయతీ అగ్రహారం వద్ద సుమారు 10ఎకరాల ప్రభుత్వ భూమిని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకొన్నారు. ఇది వైసీపీ అనుచరుల పనేనంటూ ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో సందెట్లో సడేమియా అన్నచందంగా ఆ భూమిని కాజేసే ప్రయత్నం జరిగింది. ఇవి వెలుగులోకి వచ్చిన సంఘటనలు కాగా వెలుగులోకి రాని భూకబ్జాలు చాలానే ఉన్నాయి. అనంతసాగరం చెరువు లోతట్టు ప్రాంతంలో మంచాలపల్లి వద్ద ఇళ్ల నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. పట్టాలు లేకపోయిన అక్రమ నిర్మాణాల వెలుస్తున్న పరిస్థితి ఉండగా నియంత్రణ చర్యలు కనిపించడం లేదు. ఈ చెరువు కింద ముస్తాపురం మంగుపల్లి లోతట్టు ప్రాంతాలు పొలాలుగా రూపాంతరం చెందిన పరిస్థితి ఉంది. ఇక కామిరెడ్డిపాడు చెరువు కట్టపై ఉన్న రివెట్‌మెంట్‌ను తొలగించి స్తంభాలు పాతి ఇది తమ పొలమంటూ కొందరు పత్రాలు చూపిస్తున్నారు. పీకేపాడు, బొమ్మవరం చెరువులో పరిస్థితి ఇలాగే ఉంది. అనంతసాగరం, సోమశిల జగనన్న లేఅవుట్‌లలో ఖాళీగా ఉన్న స్థలాలలను కొందరు ఆక్రమించి తమ స్వాధీనంలో ఉంచుకొన్నారు. లే అవుట్లపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. భూ కబ్జాలపై యంత్రాగం దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిమలూరులో ప్రత్యేక గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ ఉషారాణి

ఆత్మకూరు, జూలై 21 : మహిమలూరు పంచాయతీలో సోమవారం ఓడీఎఫ్, జలజీవన్ అంశాలపై సర్పంచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ ఉషారాణి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్ద వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని, ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్త-పొడిచెత్త సేకరణ తదితర అంశాలపై వివరించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని మంచినీటి బావిలో క్లోరినేషన్ కిట్‌తో తాగునీటిని పరీక్షించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మాజీ చైర్మన్ వల్లూరు వెంకటరమణారెడ్డి, టీడీపీ నాయకులు మద్దినేని నారాయణ, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, హెల్త్‌సూపర్‌వైజర్ షేక్ సైదా పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడంపై హర్షం

మర్రిపాడు, జూలై 22: నందవరం ఆదర్శపాఠశాల విద్యార్థులకు దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అదనపు బస్సు సౌకర్యం కల్పించడంపై చుంచులూరు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం హర్షం వ్యక్తం చేశారు. కొన్నేళ్లగా చుంచులూరు, నాయుడుపల్లి గ్రామాల బడి పిల్లలకు బస్సు సౌకర్యంలేక, 8వ తరగతి వరకు హాస్టల్ వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారని చెప్పారు. మర్రిపాడు వరకు 10కిలోమీటర్ల దూరం ఆటోలో వచ్చి, అక్కడ ఆదర్శపాఠశాలకు ఏర్పాటు చేసిన మరో బస్సులో ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సి దుస్థితి ఉండేదన్నారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

పంటల పరిశీలన



ఏఎస్ పేట, జూలై 22: ఇటీవల కురిసి వర్షాలకు పొనుగోడు, పాజవోలు గ్రామాల్లో దెబ్బతిన్న వేరుశనగ పంటలను సోమవారం సోమవారం మండల వ్యవసాయ అధికారి రజిని పరిశీలించారు. రైతులతో మాట్లడి వివరాలు తెలుసుకున్నారు. పంట నష్టం జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతానని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో చిరంజీవి, సర్పంచ్ పద్మయ్య పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

సంగం, జూలై 22: యాకసిరి మఠం ఉర్దూ పాఠశాలను సోమవారం జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహిద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా వారం రోజులు శిక్షా సప్తాహ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రకు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

వరికుంటపాడు, జూలై 22: ఈ మారు జరిగిన ఎన్నికల్లో మండలంలో తెలుగుదేశం 3వేల మెజార్టీ సాధించడంలో పార్టీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు కీలకపాత్ర ఉందని సోమవారం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు. గతంలో ఏఎంసీ చైర్మన్‌గా కూడా ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తికి కీలక బాధ్యతలు అప్పగిస్తే పార్టీని మరీంత ముందుకు తీసుకెళ్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

సభ్యత్వ నమోదు పూర్తి చేయండి

సీతారామపురం, జూలై 22: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి జనసేన కార్యకర్తలు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి భోగినేని కాశిరావు తెలిపారు. సోమవారం ఈ విషయంపై ఆయన మాట్లాడారు. జనసేన నాలుగో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 28 వరకు జరుగుతుందన్నారు. క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు రూ.5లక్షల జీవితబీమా రూ.5లక్షల ప్రమాదబీమా లభిస్తుందని ప్రజలకు తెలియజేయాలన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు, జూలై 22: స్థానిక సచివాలయంలో సర్పంచ్ దిలీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి పాల్గొని మాట్లాడారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం లేని నివాసాలను గుర్తించి అర్హులకు మంజూరు చేస్తామన్నారు. వేంపాడులో సర్పంచ్ తాతపూడి విజయమ్మ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సికిందర్, కార్యదర్శి శ్రీనివాసులు, వార్డుసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఉదయగిరి, జూలై 22: మండలంలోని శకునాపల్లి పంచాయతీలోని కుర్రపల్లి గ్రామ మంచినీటి పథకం పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. సోమవారం కార్యదర్శి కరీముల్లా వీటికి మరమ్మతు చేయించారు. అనంతరం శకునాలపల్లి, కుర్రపల్లి, బీసీ కాలనీ, శకునాలపల్లి ఎస్సీ కాలనీల్లోని రోడ్ల వెంట బ్లీచింగ్ చల్లించారు. ట్యాంకులను శుభ్రం చేయించారు. కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు తేజ, షరీఫ్ పాల్గొన్నారు.

చెన్నకేశవుడికి వైభవంగా గజవాహనసేవ



గజ వాహనంపై చెన్నకేశవస్వామి

సంగం, జూలై 22: మర్రిపాడు చెన్నకేశవస్వామి ఆదివారం అర్ధరాత్రి గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా అశ్వద్ధనారాయణ కల్యాణం

స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం అశ్వద్ధనారాయణ (రాగి, వేప చెట్లు) కల్యాణం నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించారు. మధ్యాహ్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ముత్యాల పూసల అలంకరణలో పోలేరమ్మ

తలుపూరుపాడు పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు నిర్వహించి, పోలేరమ్మదేవి మూల విరాట్‌కు ముత్యాల పూసలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ షేక్ నాజున్ని, ఖాదర్‌భాష దంపతులు మధ్యాహ్న భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గంధోత్సవ గోడపత్రిక ఆవిష్కరణ



గంధమహోత్సవ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనంతసాగరం, జూలై 22: స్థానిక కరీముల్లా షాఖాదరీ దర్గా గంధోత్సవం వేడుకల గోడపత్రికను సోమవారం దర్గా పెద్దలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26న సందల్ మాలీ, 27న గంధం, ఖవ్వాలీ, 28న ఉరుసు, తహలీల్ పాతేహా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ముతావల్లి షేక్ సలావుద్దీన్, మహమ్మద్‌అలీ, ఖాదర్‌బాషా, అబ్దుల్‌గఫార్, ఖాసీంబాష, కరీముల్లా పాల్గొన్నారు.

కాలినడకన పెంచలకోనకు..



కాలినడకన పెంచలకోనకు వెళుతున్న టీడీపీ నేతలు

చేజర్ల, జూలై 22: తెలుగుదేశం అధికారంలోకి రావాలని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా.. నియోజకవర్గ శాసనసభ్యులుగా ఆనం రామనారాయణరెడ్డి గెలుపొంది మంత్రిగా బాధ్యతలు చేపట్టాలని పార్టీ మండలాధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి ఎన్నికల ముందు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి మొక్కుకున్నాడు. కోరిక తీరడంతో మొక్కు చెల్లించేందుకు సోమవారం యాన కుటుంబసభ్యులతో కలిసి పెంచలకోనకు కాలినడకన బయలుదేరారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సాగనంపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చేజర్ల, జూలై 22: ఆదురుపల్లి గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు సోమవారం చిత్తలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా లెప్రసీ ప్రోగ్రామింగ్ అధికారి డా.సురేంద్రబాబు, చిత్తలూరు వైద్యాధికారి నవీన్ పాల్గొని లెప్రసీ మచ్చలు ఏ విధంగా కనుగొనాలి. తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై వివరించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు మోహన్‌రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శైలజాకుమారి, సీహెచ్‌వో మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్స్ పంపిణీ

చేజర్ల ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం 9వ వార్డు సభ్యురాలు సోమవరపు సంగీత చేతుల మీదగా ఉపాధ్యాకులు బ్యాగులను పంపిణీ చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు హజరత్తయ్య, జయరామయ్య, వెంటకృష్ణ, రవికుమార్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేరుతో మొక్కనాటే కార్యక్రమం

సంగం, జూలై 22: దువ్వూరు ఎలైట్ ఉన్నత పాఠశాలలో పీఎం ప్రవేశ పెట్టిన అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆపస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొని పాఠశాలలో మొక్క నాటారు. ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వేణుగోపాల్, స్కూల్ డైరెక్టర్ వాసంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన స్వచ్ఛంద సంస్థల అధ్యక్షుడు

ఉదయగిరి రూరల్, జూలై 21: సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని సోమవారం రాజధాని సచివాలయంలో రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల అధ్యక్షుడు పీవీ రమణయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, ఉద్యోగుల పదోన్నతులపై ఎస్సీ, ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాల గురించి వివరించామని తెలిపారు. ఆయన వెంట బాలగంగాదర్‌తిలక్ స్వచ్ఛంద సంస్థల రాష్ట్ర సలహాదారు పీ.ప్రకాష్, డైరెక్టర్ ఎం.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక గ్రామసభలు

ఉదయగిరి, జూలై 22: దాసరిపల్లి, అప్పసముద్రం, పుల్లాయపల్లి పంచాయతీ కార్యాలయాల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. సర్పంచులు కల్లూరి శ్యామలాదేవి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో కార్యదర్శులు తేజ, చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: జయపురం పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచి కోనేశ్వరరావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ పాల్గొని మాట్లాడారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రజా సమస్యలకు పరిష్కారానికి కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచాలి

ఆత్మకూరు, జూలై 22 : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి గోపాల్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శిక్షా సాప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడురోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనంతలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ వంటేరు మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కావలి : తుమ్మలపెంట రోడ్డులో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్‌ను జిల్లా అకౌంట్స్ మానిటరింగ్ ఆఫీసర్ జీ. సుధాకరరావు ప్రారంభించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల చేత తయారు చేయించిన బోధనోపకరణాలను ప్రదర్శించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కావలి ఉప విద్యాశాఖ అధికారి రఘురామయ్య, మండల విద్యాశాఖ అధికారులు గోవిందయ్య, వెంకటసుబ్బయ్య, హెచ్ఎం నీరజ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం: మండలంలోని మాలకొండరాయునిపాలెం పాఠశాలలో సోమవారం శిక్షాసప్తాహ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఎం కే వెంకట కృష్ణారెడ్డి పర్యవేక్షణలో విద్యార్థులు స్థానిక వనరులతో బోధన అభ్యసనా సామగ్రిని తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు తిరుమల, విద్యార్థుల తలిదండ్రులు పాల్గొన్నారు.

కొండాపురం : బోధనా అభ్యసనా కృత్యాలు విద్యలో ఎంతో కీలకమని ఎంఈవో- 1 రవికుమార్, ఎంఈవో-2 ఆనందరావు అన్నారు. శిక్షా సప్తాహ్ లో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులు అభ్యసనా కృత్యాలు ప్రదర్శించారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, ఇతర పాఠశాలలకు వెళ్లి ఎంఈవోలు అభ్యసనాకృత్యాలను పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనంతసాగరం : చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం ఎస్ఈపీ ఆకారంలో చేసిన ప్రదర్శన ఆకట్టుకొంది. ఈ నెల 28 వరకు సప్తాహ్ (విద్యావారం) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. నూతన జాతీయ విద్యావిధానం అమలు చేసి నాలుగేళ్ల పూర్తికావడంతో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ఆకారంలో విద్యార్థులచే ప్రదర్శన చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, మదీనా పాల్గొన్నారు.



కావలి : సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు



ఆత్మకూరు : విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో గోపాల్

సాయినాథుడి గ్రామోత్సవం



కలిగిరి, జూలై 22: స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం విశేషపుష్పాలంకరణతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, భజన అందరినీ ఆకట్టుకుంది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జూలై 22 : మండలంలోని మొగిలిచెర్ల మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు.ఎస్సై ఎం బాజీబాబుకు అందిన ముందస్తు సమాచారంతో సోమవారం మధ్యాహ్నం మన్నేరులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోటారు బైకుల ఢీ : ఇద్దరికి గాయాలు



గాయపడిన మాల్యాద్రి

వలేటివారి పాలెం, జూలై 22 : ఎదురెదురుగా వస్తున్న మోటారు బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలవగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.ఈ సంఘటన మండలంలోని బొంతవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని బంగారక్కపాలెంకి చెందిన దేపూరి మాల్యాద్రికి స్వల్ప గాయాలు కాగా, కందుకూరుకు చెందిన ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మాల్యాద్రి కందుకూరు నుంచి మోటారు బైకుపై బంగారక్కపాలెం వస్తుండగా అదే సమయంలో మరో వ్యక్తి బొంతవారిపాలెంలో బేల్దారి పని చేసి ముగించుకొని కందుకూరు వెళ్తుండగా అదుపుతప్పి రెండు మోటారుబైకులు ఢీకొన్నాయి. గాయపడిన ఇద్దరిని 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేస్తున్నారు.

ప్రతి ఇంటికి తాగునీరే లక్ష్యం

అల్లూరు, జూలై 22 : ప్రతీ ఇంటికి తాగునీటిని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎంపీడీవో జ్యోతి అన్నారు. మండలంలోని బీరంగుంట, పురిణి, ఇందుపూరులలో సోమవారం గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పురిణిలో ఆమె మాట్లాడారు. తాగునీటికోసం జలజీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా ల నిధులతో తాగునీటి సమస్యను తీర్చేందుకు కార్యాచరణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, మండల అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన

లింగసముద్రం, జూలై 22 : మండలంలోని మొగిలిచర్ల రైతు భరోసా కేంద్రంలో సోమవారం కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహాం లింకన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు,టీ దీప, వీఆర్‌వో వినోద్, రైతులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి మహాప్రభో..!

కొండాపురం, జూలై22: అంగన్‌వాడీ భవన నిర్మాణానికి బిల్లులు విడుదలయినా చెల్లించడంలేదంటూ కాంట్రాక్టరు నర్రావుల వెంకటేశ్వర్లు ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పెరికపాలెంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి రూ.3.50 లక్షలకు అగ్రిమెంటు చేసుకొని సీలింగ్, గోడలు ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, వంటశాల పూర్తిచేశానని తెలిపారు. పంచాయతీ ఖాతాలో రెండు నెలల క్రితం నగదు జమ అయినా ఇప్పటివరకు నగదు ఇవ్వలేదన్నారు. తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

కందుకూరు, జూలై 22: రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని మాట్లాడితే ప్రజలు క్షమించరన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధానాలకు ఇప్పటికైనా జగన్ స్వస్తి పలక్కపోతే వైసీపీని రాష్ట్రంలోనే లేకుండా ప్రజలు తరిమికొడతారని ఆయన హెచ్చరించారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో ఎన్నో దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలిటౌన్, జూలై22: పెండింగ్ జీతాలు చెల్లించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ప్రజా విజ్ఞప్తుల దినంలో సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు షేక్ రెహనాబేగం మాట్లాడుతూ పెండింగ్ జీతాలు, సమ్మె కాలంనాటి జీతాలు, హెల్త్ అలవెన్సు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తురకా శీనయ్య, శివకోటయ్య, ఒంగోలు రమేష్, పరుసు జేమ్స్, బాబు, క్రాంతి, పీ అనిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మెగా అభిమానులు



మొక్క నాటుతున్న మెగా అభిమానులు

గుడ్లూరు, జూలై 22: మండలంలోని చేవూరు హైస్కూల్ ప్రాంగణంలో మెగా అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు సోమవారం మొక్కలు నాటారు. జనసేన నియోజకవర్గ నాయకులు దేవళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. ఆగస్టు 22న చిరంజీవి జన్మదినం సందర్భంగా ప్రతి నెలా 22న ఏదో ఒక ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. అందులో భాగంగా చేవూరు హైస్కూల్లో మొక్కలు నాటామన్నారు.కార్యక్రమంలో మండల జనసేన నాయకులు మూలగిరి శ్రీనివాసులు, చేవూరు సర్పంచి శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, అనిమిశెట్టి మాధవరావు, భైరవరపు రాజశేఖర్, ఆత్మకూరు సుధాకర్, అన్నంగి చలపతి, సన్నిశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య

కావలిటౌన్, జూలై22: విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కొత్తగా చేరిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శేషయ్య మాట్లాడుతూ నేటి సమాజం సాంకేతిక పరిజ్ఞానంతో ముడిపడివుందని, విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యనభ్యసించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్ ఇన్‌చార్జ్ సుబ్బయ్య, ప్లేస్‌మెంట్ అధికారి వంశీమోహన్, వైస్ ప్రిన్సిపాల్స్ సునీల్, శ్రీనాథ్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు కొండారెడ్డి, స్రవంతి, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ ఉద్యోగమే లక్ష్యంగా ప్రణాళిక

కందుకూరు : తమ కళాశాలలో చేరిన ప్రతిఒక్కరూ కార్పొరేట్ ఉద్యోగంతో బయటకు వెళ్లేలా చూడటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. సోమవారం కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నికల్ డైరక్టర్ కే విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది తమ కళాశాల సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థులు 40 మంది హుండాయ్, టీవీఎస్ కంపెనీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టరు సురియా, మీరావలి,జీ ప్రసాద్, డాక్టరు శైలేష్, హిమబిందు, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగనారుకు కొత్తభూమిని ఎంచుకోవాలి



ప్రసంగిస్తున్న డాక్టరు ప్రసాద్‌బాబు

కందుకూరు, జూలై 22: పొగాకు నారుమడి పొలాన్ని ప్రతిఏటా మార్చటం వల్ల నాణ్యమైన పొగనారు పెంచుకోవచ్చునని కందుకూరు కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ ప్రసాద్‌బాబు తెలిపారు. కేవీకేలో సోమవారం పొగాకు రైతులకు నాణ్యమైన పొగనారు పెంపకంపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా ఒకేచోట నారుమడి పెంచితే చీడపీడలు, వివిధ వ్యాధులు సోకడమోగాక వంగడాల కల్తీ జరిగి నాణ్యమైన పొగనారు రాదన్నారు. నారుమడులు సిద్ధం చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, నారుమడులు సాగుచేసే రైతులు తదితరులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఐదు వినతులు

కందుకూరు, జూలై 22: మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయా సమస్యలను తక్షణం పరిష్కరించాలని సెక్షన్ హెడ్స్‌కు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. పారిశుధ్యం, వీధిలైట్లు, తాగునీరు లాంటి సమస్యలపై ప్రజలు 91777 00267 నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక డ్రైవ్

కలిగిరి, జూలై 22: మంగళవారం నుంచి ఈనెల 27వరకు మండలంలోని పెదకొండూరు, క్రాకుటూరు సచివాలయాల్లోనూ, సిద్దనకొండూరు జడ్పీ ఉన్నతపాఠశా లలోనూ ఆధార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ డ్రైవ్‌లో చిన్నారులకు నూతన ఎన్‌రోల్‌మెంట్, ఆధార్‌లో చిరునామా మార్చటం, ఈకేవైసీ సేవలు అందిస్తామన్నారు. ఆయా ప్రాంత ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

కాలువల్లో పూడిక తీయించండి

● ఎన్ఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి

నెల్లూరు(సిటీ), జూలై 22 : వర్షాకాలం మొదలైనందున నగరంలోని కాలువల్లో పూడిక తీయించాలని టీడీపీ నేత ధర్మవరం సుబ్బారావు కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్పొరేషన్‌లో ఏడీసీ శర్మదకు వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలపై గత ప్రభుత్వం మోపిన పన్నుల భారాన్ని తగ్గించాలని కోరారు. 47వ డివిజన్‌లో నెలకున్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా తన ఇంటికి సంబంధించి కార్పొరేషన్‌లో పన్ను వేయిస్తానంటూ గౌసియా అనే మహిళ తన వద్ద విడతల వారీగా రూ.91 వేలు వసలు చేసిందని గాంధీబొమ్మ కూడలికి చెందిన రాజేశ్వరి ఫిర్యాదు చేసింది. అందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల ఆధారాలు తన వద్ద ఉన్నాయని పేర్కొంది. అలాగే నగరానికి చెందిన పలువురు వివిధ సమస్యలపై విజ్ఞప్తులు అందజేశారు.


ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నేత సుబ్బారావు

27న రాపూరు మండల సభ

రాపూరు(డక్కిలి), జూలై 22: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఎంపీపీ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సోమవారం ఎంపీడీఓ రంగయ్య తెలిపారు. సమావేశానికి స్థానిక శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ హాజరు అవుతారని చెప్పారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

భూముల కబ్జాపై నోరుమెదపని అధికారులు

● ప్రజా సంఘాల ఐక్యవేదిక నేత మునెయ్య

రాపూరు(డక్కిలి), జూలై 22 : మండలకేంద్రం సమీపంలోని మద్దెలమడుగు వాగు పోరంబోకు భూమిని కొందరు అక్రమార్కులు అక్రమంగా లే అవుట్లు వేసి సొమ్ము చేసుకోవడం విచారకరం అని, ఇంతజరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోక పోవడం విచారకరం అని ఏపీ ప్రజా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆరోపించారు. సోమవారం రాపూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాపూరు నుండి నెల్లూరు, గూడరు, వెంకటగిరి రోడ్డు మార్గంలో మద్దెల మడుగు సర్కిల్‌కి సమీపంలోని కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు అని చెప్పారు. వాగు, రోడ్డు పోరంబోకు భూములను కొందరు అక్రమార్కులు ఆక్రమించి పక్కనే వున్న సెటిల్ మెంటు భూములకు సంబంధించిన నెంబర్లతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరిపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో వైద్యఆరోగ్య శాఖ, పశువుల ఆసుపత్రిలలో పనిచేసే ఇద్దరు సిబ్బంది కీలకంగా వ్యవహరించారని తెలిపారు. రాపూరు సర్వే నెంబరు 1056-1ఎ లో కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణలో వీరిద్దరి పాత్ర వుందని చెప్పారు. ఈ వ్యవహారంపై కలెక్టరు విచారణ చేపట్టి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భూ ఆక్రమణలపై పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న గద్దల మునెయ్య

'నారాయణ'లో క్విజ్ పోటీలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న వైద్యులు

నెల్లూరు(వైద్యం), జూలై 22 : నారాయణ వైద్య కళాశాల ఆధ్వర్యంలో బ్రెయిన్ డేను పురష్కరించుకుని సోమవారం నారాయణ కాన్సెప్ట్ స్కూలు విద్యార్థులకు అగ్ని, పృథ్వి, త్రిసూల్, ఆకాష్ తదితర మిసైల్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. న్యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ అనూష మాట్లాడుతూ స్ట్రోక్, మైగ్రేన్, ఎపిలెప్సీ, అల్జీమర్స్ వంటి మెదడు వ్యాధులు 50 శాతం ముందుగానే గుర్తించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ కాన్సెప్ట్ స్కూల్ డీన్ నరేంద్ర, ఏజీఎం రమణారెడ్డి, ప్రిన్సిపాల్ వెంగళరావు, ఆసుపత్రి ఏవోపీ సుధీర్‌బాబు, కార్పొరేట్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వినోద్‌కుమార్, శివరంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంహెచ్‌వో వెంకటరమణయ్య డిప్యుటేషన్ రద్దు

● వైద్య, ఆరోగ్యశాఖకు తిరిగి పంపుతూ ఉత్తర్వులు

● మురళీకృష్ణ ఫిర్యాదుతో రంగంలోకి ప్రభుత్వం

నెల్లూరు(సిటీ), జూలై 22 : నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణయ్య డిప్యుటేషన్ ఉత్తర్వులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 16నే ఈ ఆదేశాలు జారీ అయినప్పటికీ సోమవారం వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరులోని మురళీకృష్ణ హోటల్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన వెంకటరమణయ్య ఆహారం సరిలేదని, పారిశుద్ధ్య నిర్వహణను ఆక్షేపిస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ అధికారం ఆయనకు లేదని హోటల్ యాజమాని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రభుత్వం శాఖపరంగా అంతర్గత విచారణ చేపట్టింది. హోటల్ యాజమానితో ఏకీభవించిన విచారణ అధికారులు ఆయనకు ఆహార పదార్థాలను పరిశీలించే అధికారం లేదని తేల్చారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపడంతో వైద్య, ఆరోగ్య శాఖ నుంచి డిప్యుటేషన్‌పై ఆరోగ్య అధికారిగా పని చేస్తుండటంతో ఆ అధికారాన్ని రద్దు చేస్తున్నట్లు సింఘాల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయనను తిరిగి వైద్య, ఆరోగ్యశాఖకు వెళ్లిపోవాలని సూచించారు. ఈ మేరకు కార్పొరేషన్‌లోని అధికారులు దస్త్రం సిద్ధం చేయడంతోపాటు ఈ విషయాన్ని ఇన్‌చార్జి కమిషనరైన కలెక్టర్ ఓ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

కోవూరు, జూలై 22: స్థానిక కోర్టుల్లో న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విజయవాడ బార్ అసోసియేషన్ ఇద్దరు సభ్యులపై దాడికి నిరసనగా విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూండ్ల బాబు తెలిపారు. న్యాయవాదులు పదోతరగతి నుంచి లా డిగ్రీ వరకు తమ సర్టిఫికెట్ల జెరాక్సు కాపీలను రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు సమర్పించాలని కోరడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. అనంతరం న్యాయాధికారులకు వినతిపత్రాన్ని అందచేశామన్నారు.

అపోలోలో న్యూరో కేర్ యాప్ ఆవిష్కరణ


న్యూరో కేర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో, వైద్య నిపుణులు

నెల్లూరు(వైద్యం), జూలై 22 : నెల్లూరు అపోలో ఆసుపత్రిలో సోమవారం బ్రెయిన్ డేను పురష్కరించుకుని న్యూరో కేర్ యాప్‌ను న్యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ బిందుమీనన్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య పాల్గొని అందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ మైగ్రేన్‌తో బాధపడే రోగులకు న్యూరో కేర్ యాప్ ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. రోగులను నిత్యం పర్యవేక్షిస్తూ వారి ఆరోగ్య సమాచారాన్ని వైద్యులకు తెలియచేస్తుందని తెలిపారు. ప్రపంచ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీతో కలిసి మెదడు, నరాల రుగ్మతల గురించి ప్రజల్లో అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వివేకానంద ఎడ్యుకేషనల్ సొసైటీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధన బృందంతో కలిసి ఈ న్యూరోకేర్ యాప్‌ను రూపొందించామన్నారు. మైగ్రేన్ యాప్ బటన్ నొక్కడం ద్వారా రోగుల పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు. దీనికి అనుగుణంగా రోగులకు తగిన చికిత్సలు చిట్కాలు తెలియచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, డాక్టర్ రశ్మి, డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వం చేసుకోండి

మనుబోలు, జూలై 22: మండలంలో జనసేన క్రియాశీలక సభ్యత్వాల కార్యక్రమాన్ని ప్రారంభించామని పార్టీ మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మనుబోలులో ఈ విషయంపై మాట్లాడారు. ఈ నెల 28వరకు సభ్యత్వాల నమోదు ఉంటుందన్నారు. పార్టీలోని వీర మహిళలు, జనసైనికుల మేలు కోరుతూ అధినేత కే, పవన్‌కల్యాణ్ సభ్యత్వంతో పాటు, ప్రమాబీమా కల్పించారన్నారు. ఈ అవకాశాన్ని జన సైనికులు, వీర మహిళలు, పవన్‌కల్యాణ్ అభిమానులు సద్వినియోగం చేసుకోవాలని ప్రసాద్ కోరారు.

విద్యారంగానికి సీఎం పెద్దపీట

కొడవలూరు, జూలై 22: రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేసేలా సీఎం చంద్రబాబు కార్యాచరణ రూపొందిస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెం ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రైవేటు పాఠశాలలు ఉన్నత విద్యాప్రమాణా లకు నిలయాలుగా మారనున్నాయన్నారు. పేదరికాన్ని జయించాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటూరి రమేష్, కరకటి మల్లికార్జున, మందిపాటి రమణారెడ్డి, ఇరువూరి యోగానందరెడ్డి, తువ్వర ప్రవీణ్‌కుమార్, సిదార్థ, బండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


కిట్లు అందుకున్న విద్యార్థులతో టీడీపీ నాయకులు

సాయిబాబా మందిరాల్లో పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 22: నగరంలోని ట్రంకురోడ్డు గాంధీబొమ్మ సెంటర్‌లోని షిరిడీ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం షిరిడీ హారతులు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, సాయి సహస్రనామ పూజలు జరిగాయి. మధ్యాహ్నం హారతి, మంత్ర పుష్పం, ప్రసాదాలు వితరణ, ప్రత్యేక పూలంగి సేవ జరిగింది. ఈ కార్యక్రమాన్ని మందిరం చైర్మన్ మణ్యం అమర్నాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. బాలాజీనగర్ పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాయిబాయి చరిత్ర గ్రంథాన్ని అఖండ పారాయణం చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని మందిరం నిర్వహకులు మధుసాయి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కిమ్స్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స

● తండ్రి కిడ్నీ కుమార్తెకు అమర్చిన వైద్యులు



మాట్లాడుతున్న కిమ్స్ ఈడీ గిరినాయుడు

నెల్లూరు(వైద్యం), జూలై 22 : నెల్లూరు నగరంలోని కిమ్స్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతగా జరిగింది. ఈ సందర్భంగా సోమవా రం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు మాట్లాడుతూ జిల్లాలోని ఇందుకూరుపేట మండలం కొత్తూరుకు చెందిన మనీషా(24) గత కొద్ది కాలంగా కిడ్నీ వ్యాధులతో బాధపడేదన్నారు. ఈ పరిస్థితిలో బాధితురాలు తండ్రి మల్లిబాబు ఒక కిడ్నీని ఇవ్వడంతో ఈనెల 13వ తేదీన విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించారని చెప్పారు. ఇప్పటి వరకు కిమ్స్ ఆసుపత్రిలో 30 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ మనీషాది వయస్సు తక్కువగా ఉండటం తండ్రి ఎంతో ప్రేమ తో ఒక కిడ్నీ ఇవ్వడంతో కిడ్నీ మార్పిడి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ సతీష్‌కుమార్, యూరాలజిస్ట్ డాక్టర్ సనేష్‌రెడ్డి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ శేషయ్య, మత్తు వైద్య నిపుణులు డాక్టర్ జగదీష్, డీజీఎం శివమాల, మెడికల్ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు బిల్లులతో ఇసుక లోడింగ్


డంపింగ్‌యార్డులో లోడింగ్ ఇన్‌చార్జ్‌ని విచారిస్తున్న సెబ్ ఎస్ఐ

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 22: మినగల్లు రీచ్‌లో తప్పుడు బిల్లులతో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. అధికారులు చేసిన తప్పునకు ఇన్‌చార్జి మార్పుతో సరి అన్న చందంగా ఇక్కడ వ్యవహారం ఉంది. సోమవారం నుంచి డంపింగ్ యార్డులో ఇసుక లోడింగ్ ప్రారంభించి, చర్యలు చేపట్టాల్సిన అధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు ఉన్నాయి. మండలంలోని మినగల్లు రీచ్‌లో ఆదివారం రెండు టిప్పర్లకు తప్పుడు బిల్లులపై ఇసుక లోడింగ్‌ను చేస్తుండగా స్థానిక వాహనదారులు అడ్డుకున్నారు. వెంటనే లోడింగ్ ఇన్‌చార్జిని నిలదీయగా శనివారం బిల్లులు రాయించుకున్నట్లు బుకాయించాడు. ఆదివారం లోడింగ్‌కు పెట్టకముందే ఔట్ టైమింగ్ నమోదుపై నిలదీయడంతో తప్పించుకోలేక మైనింగ్ అధికారి ప్రసాద్ చెప్తే లోడుచేసినట్టు సెబ్ ఎస్. రవికుమార్, సర్పంచులకు చెప్పాడు. దీంతో ఇన్‌చార్జ్‌పై కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తానని ఎస్ఐ హెచ్చరించారు. అయితే యార్డు నిర్వహణకు చెందిన మరో వ్యక్తి, స్థానిక నాయకుల హామీలతో ఇన్‌చార్జి జశ్వంత్‌ను పంపించేసి సోమవారం రావాలని చెప్పారు. కానీ సోమవారం ఇసుక లోడింగ్ జరిగింది. ఈ విషయమై సెబ్ సీఐ. యశోధరాదేవిని వివరణ కోరగా శనివారం బిల్లుపై ఆదివారం లోడుచేశారని చెప్పారు. అసలు ఆ బిల్లులు తమకు ఇవ్వని కారణంగా చర్యలు తీసుకోలేదని తెలిపారు.

వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీరు అందించండి

మనుబోలు, జూలై 22: మండలంలోని 5తీరప్రాంత గ్రామాలకు కండలేరు జలాలతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి తాగునీరు అందించాలని టీడీపీ జిల్లా నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, బద్దెవోలు టీడీపీ నాయకులు శానంపూడి సురేంద్రరెడ్డి గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ కార్తీకొరెడ్డిని కోరారు. మండలంలోని బద్దెవోలు పంచాయతీ కార్యాలయంలో సోమవారం జలజీవన్ పథకంపై సర్పంచు శశికుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో బద్దెవోలు గ్రామస్థులు మాట్లాడారు. గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. పంచాయతీల నుం చి కుళాయిల్లో ఉప్పునీరు వస్తోందన్నారు. ఎక్కడ బోరు వేసిన ఉప్పునీరే పడుతుందని వాపోయారు. కండలేరు జలాలతో వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి బద్దెవోలుతో పాటు, పరిసర గ్రామాలైన వెంకన్నపాళెం, కట్టువపల్లి, పిడూరుపాళెం, కొలనుకుదురు గ్రామాలకు తాగునీరు అందించాలని గ్రా మసభలో అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ జీవీఎస్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భద్రత కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

వెంకటాచలం, జూలై 22: మన భద్రత కోసం మనపై ఆధారపడిన వారికోసం, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా.సి. యామిని ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆమె ర్యాలీ చేపటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ద్విచక్రవాహనాలను వినియోగించే వారి సంఖ్య నానాటికీ పెరిగిపోయిందన్నారు. చాలా మంది హెల్మెట్‌లు ధరించకుండా వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలబారిన పడుతున్నారని చెప్పారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, మోటార్‌వాహన చట్టంలోని నిబంధనల కోసమో, లేక పోలీసుల వేసే జరిమానా నుంచి తప్పించుకోవడం కోసమో కాదన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్, ఏఎస్ఐ. శ్రీధర్, న్యాయవాది శివప్రసాద్ ఉన్నారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

జగనన్న కాలనీకి దారి చూపండి

మనుబోలు, జూలై 22: స్థానిక జగనన్న కాలనీకి దారి చూపాలంటూ అక్కడ నివాసం ఉంటున్న ప్రజలు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కాలనీలో 20కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. జాతీయ రహదారి నుంచి కిలోమీటరు దూరంలో ఈ కాలనీలో ఇంకా చాలా మంది ఇళ్ళు కట్టుకుంటున్నారని చెప్పారు. కాలనీకి గతంలో నాలుగు దారులు ఉండేవన్నారు. కాలనీ చుట్టుప్రక్కల ప్రైవేటు స్థలాలు, లేఅవుట్లు ఉండడంతో, కాలనీలోకి వెళ్లకుండా గోతులు తీయడం, ముళ్లకంపలు వేశారన్నారు. ఇంకోదారి ఉంటే అదిపూర్తిగా చెట్లతో మూసుకుపోయిందన్నారు. కాలనీకి వెళ్లాలన్నా, రావాలన్నా ఇబ్బందిగా ఉందని వాపోయారు. కాలనీ ఏర్పాటు చేసినా, రోడ్డు వేయకుండా వదిలేశారన్నారు. గతంలో కాలనీకి అధికారులు దారి చూపించినా, అందులోంచి ప్రైవేట్ వ్యక్తులు వెళ్లకుండా అడ్డుకున్నారని వాపోయారు. అంతకుముందు తహసీలార్ చిరంజీవికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ వీఆర్‌వో నాగార్జునరెడ్డికి దారి ఏర్పాటు పరిష్కారం చేయాలని సూచించారు.


ఆందోళన చేస్తున్న జగనన్నకాలనీవాసులు

రేపు షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 22: ఈనెల 24న సబ్ జూనియర్స్ షూటింగ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ బీవీ రమణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు కోవూరు మండలం పాటూరు జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు బుధవారం మధ్యాహ్నం 3గంటలకు పాటూరుకు రావాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 10,11తేదీల్లో చిత్తూరు జిల్లా కుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 2008 ఏప్రిల్ ఒకటి తరువాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు.

సాగుభూమి ఆక్రమణపై ఆవేదన

విడవలూరు, జూలై 22: సాగులో ఉన్న భూమిని కొంతమంది బలవంతంగా ఆక్రమించుకున్నారని ముదివర్తికి చెందిన షేక్ మహ్మద్ ఆవేదన వ్యక్తం చేశాడు. విడవలూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1975లో గ్రామంలోని దివ్యాంగులకు ప్రభుత్వం సర్వేనెంబరు 1011లో సుమారు 10 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. అప్పటి నుంచి ఆ భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే తమ భూములను గ్రామానికి చెందిన కొందరు బలవంతంగా ఆక్రమించుకున్నారని పేర్కొన్నాడు. ఈ విషయమై జిల్లాధికారులు, మండలాధికారు లకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ భూమిని కోల్పోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని తెలిపారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. అధికారులకు ఫిర్యాదు చేసిన పత్రాన్ని చూపించాడు.


ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న దివ్యాంగుడు మహ్మద్

నీటిని పొదుపుగా వాడాలి

● గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఏస్తేరమ్మ

తోటపల్లి గూడూరు జూలై 22: మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల్లో సోమవారం ఎస్సీఈఆర్టీ ద్వారా శిక్ష సహస్త కార్యక్రమంలో భాగంగా సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అండ్ ఎర్త్ కార్యాక్రమానికి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏస్తేరమ్మ మాట్లాడారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు. ఇంకుడుగుంతలతో వాన నీటిని నింపి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని ప్రతిఒక్క విద్యార్థి తమ తల్లిదండ్రులకు వివరించాలన్నారు. సైన్స్ ఉపాధ్యాయురాలు వెంకటేశ్వరి మాట్లాడారు. భూగర్భ జలాలు కాపాడుకోనేందుకు నీటినిల్వలు అవసరమన్నారు. రాబోయే కాలంలో అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తొలుత ప్లకార్డుల తో ప్రదర్శనలు చేపట్టారు.


నీటి నివియోగంపై ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

రొట్టెల పండుగలో సేవలకు సన్మానం


నెల్లూరు(వైద్యం), జూలై 22 : ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రొట్టెల పండుగలో భక్తులకు వైద్యం, ఇతర సేవలు అందించిన వలంటీర్లకు సోమవారం రెడ్‌క్రాస్‌లో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు దాసరి రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్ డాక్టర్ శ్రీరంజని, రెడ్‌క్రాస్ డిజాస్టర్ మేనేజింగ్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రొట్టెల పండుగలో రెడ్‌క్రాస్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో రెడ్‌క్రాస్ వలంటీర్లతో పాటు కమ్యూనిటీ పారామెడక్స్ అండ్ ప్రైమరి హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని రోగులకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య కళాశాల డీన్ సుధారాణి, పీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, ఆర్ఎంపీ అధ్యక్ష, కార్యదర్శులు కోలా రవీంద్రబాబు, రోజారాణి, స్నాప్టిక్ సెంటర్ కో ఆర్డినేటర్ నల్లబోలు జయరామయ్యానాయుడు, ఏవో చంద్రశేఖర్‌రావు, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందజేస్తున్న రెడ్‌క్రాస్ నిర్వాహకులు

శిక్షా సప్తాహ్‌తో సులభంగా బోధన

బుచ్చిరెడ్డిపాలెం, జూలై 22: పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌తో విద్యార్థులకు విద్యను సులభతరంగా బోధించవచ్చునని ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ.రత్నం అన్నారు. మండలంలో సోమవారం నుంచి ప్రారంభమైన శిక్ష సప్తాహ్ కార్యక్రమాలను రామచంద్రాపురం. జొన్నవాడ, రెడ్డిపాళెంలోని ప్రాథమిక పాఠశాలల్లో వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యసన సామగ్రితో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడంద్వారా విద్యార్థులకు ఎక్కువకాలం గుర్తుంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి, రిసోర్సు పర్సన్ గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

● ఉర్దూ పాఠశాలల సందర్శన

బుచ్చి మండలంలోని దామరమడుగు, బుచ్చిలోని ఉర్దూ బాలుర పాఠశాలలను సోమవారం జిల్లా ఉర్దూ స్కూల్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజా మొహిద్దీన్ సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు తయారుచేసిన బోధనాభ్యసన సామగ్రి ప్రదర్శనను ఆయన పరిశీలించారు.

ఎనెల్ ఆసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం


నెల్లూరు(వైద్యం), జూలై 22 : ప్రపంచ మెదడు దినోత్సవం సందర్భంగా సోమవారం ఎనెల్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో మెదడు వ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో ప్రముఖ న్యూరాలజీ వైద్య నిపుణులు డాక్టర్ లావణ్య, డాక్టర్ హరిత కుమారిలు పాల్గొని మెదడు వ్యాధులకు సంబంధించి వైద్య చికిత్సలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతిమరుపు, మూర్ఛవ్యాధి, తలతిరుగుడు, తలనొప్పి, పార్కిన్సన్స్ వంటి వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇందులో పాల్గొన్న 70 మంది రోగులకు ఉచిత డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు డైటీషియన్, సైకాలజీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎనెల్ ఆసుపత్రి చైర్మన్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల ఇలాంటి వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

పోరంబోకు భూముల్లో నిర్మాణాలు జరగలేదు

రాపూరు(డక్కిలి), జూలై 22 : రాపూరు మండల మద్దెల మడుగు పోరంబోకు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు జరుగలేదని తహసీల్దార్ వెంకటస్వామి సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. సోమవారం 'పోరంబోకు భూములు.. హాంఫట్' అని ఆంధ్రజ్యోతిలో ప్రసురితమైన కథనానికి ఆయన స్పందించారు. రాపూరు రెవెన్యూ గ్రామ సర్వే నెంబరు 200ఎ, 200 బి పోరంబోకు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్ట లేదని ఇవి తమ విచారణలలో నిర్ధారణ అయ్యిందన్నారు. పక్కనే వున్న సర్వే నెంబరు 221-1లోని భూమిలో మాత్రమే నిర్మాణాలు జరిగాయని ఆయన స్పష్టం చేశారు.

బండారు దత్తాత్రేయను కలిసిన బీద

నెల్లూరు(వైద్యం) జూలై 22 : హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర సోమవారం విజయవాడలోని వివంతగ్రాండ్‌లో మార్యాద పూర్వకంగా వలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.





హలో.. మీ అబ్బాయి పెద్ద క్రైంలో ఇరుక్కున్నాడు

కొత్తరకం మోసాలకు తెరలేపిన సైబర్ నేరగాళ్లు

పోలీసు అధికారుల పేర్లతో మొబైల్ వాట్సాప్ కాల్స్

ఆందోళనతో మోసపోతున్న అమాయక తల్లిదండ్రులు

"హలో.. హలో.. రంగబాబు మీ అబ్బాయే కదా?"
"అవును సార్"
"బెంగళూరులో ఫలానా కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగే కదా"
"..సార్..సార్.. అవును సార్ ఏమైంది సార్
"మీ అబ్బాయి ఫ్రెండ్స్‌తో కలిసి పెద్ద క్రైంలో ఇరుక్కున్నాడు. ఇప్పుడు మా అదుపులోనే ఉన్నాడు"
"అదేంది సార్.. మావాడు అట్లాంటి వాడు కాదు సార్.. మీరెవరు సార్"
"నేను బెంగళూరు ఏసీపీని"
"సార్.. నమస్తే సార్.. ప్లీజ్ సార్"
"మీవాడు ఇంకా ఇరుక్కోకముందే జాగ్రత్త పడండి"
"చెప్పండి సార్. ఏం చెయ్యమంటారు సార్"
మా ఇన్‌స్పెక్టర్ మాట్లాడతాడు వినండి అంటూ ఫోన్ ఇంకొకరికి ఇచ్చారు.
"సార్ బాగా సీరియస్‌గా తీసుకున్నారు కేసు. తొందరపడకపోతే మీ అబ్బాయి ఫ్యూచర్ స్పాయిల్ అయిపోతుంది"
"సార్.. నమస్తే.. దయతలవండి సార్"
"సార్‌ని ఎలాగోలా మేనేజ్ చేస్తాను. ఒక అకౌంట్ నెంబర్ ఇస్తాను. లేట్ చేయకుండా వెంటనే ఫోన్‌పేలో ముందు 50 వేలు వేసేయండి.. లేట్ చేస్తే ఆ తర్వాత మీ ఇష్టం"
ఫోన్ పెట్టేయడంతో ఆ తండ్రికి ముచ్చెమటలు పోశాయి. కొడుకు నెంబర్‌కి ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వచ్చింది. దాంతో ఇంట్లో అందరూ ఏడుపులకెత్తుకున్నారు. వాట్సాప్‌లో వచ్చిన కాల్ చూస్తే ఒక పోలీసు అధికారి ప్రొఫైల్ పిక్ ఉంది. అశోక్ జైన్, ఏసీపీ అని కూడా ఉంది.



కుటుంబం అంతా తల్లడిల్లిపోయింది. ఏమైందో ఏమో ముందు వాళ్లు అడిగిన డబ్బులు వేసేయండి అని ఇంట్లోవాళ్ల ఒత్తిడి మొదలైంది. ఇంతలో కొడుకు నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది.
"హలో నాన్నా మీ మిస్డ్ కాల్ చూసి చేస్తున్నా..చెప్పండి"
ఆ గొంతు వినగానే తండ్రికి ఏడుపు ఎగతన్నుకుని వచ్చింది.
"ఎక్కడున్నావు రా"
"రూం లోనే నాన్నా .. ఏం.. ఎందుకు?"
"హమ్మయ్య.. ఏం లేదులే.. జాగ్రత్త."

తిరుపతిలో శనివారం ఒక తండ్రికి వచ్చిన బెదిరింపు ఫోన్ ఇది. కాస్త తేరుకుని కాల్ వచ్చిన నెంబర్ చూస్తే +92 323 0268518 అని ఉంది. అది ఇండియా కోడ్ కాదు. పాకిస్తాన్ నెంబర్. క్షణంలో మోసపోయి ఉంటాం కదా అని ఆ కుటుంబం కలవరపడింది. ఇటువంటి ఫోన్లు వారం రోజులుగా తిరుపతి జిల్లాలో అనేక మందికి వస్తున్నాయి.ముఖ్యంగా బెంగళూరు, చెన్నయ్‌లలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే కుటుంబాలనే ప్రధానంగా వీరు ఎంచుకున్నట్టు తెలుస్తోంది. +92 308 5077575 నెంబరు నుంచి మరొకరికి ఇలాగే రింగ్ అయ్యింది. డ్రగ్స్ కేసులో ఇరుకున్నారని, రేప్ కేస్ అనీ, సైబర్ క్రైం అనీ ఇలా తల్లిదండ్రులు భయపడే కారణాలు చెప్పి డబ్బు గుంజే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతూ ఉన్నాయి. కొంతమంది మోసపోయి డబ్బులు కూడా కట్టేసినట్టు ప్రచారం అవుతోంది.కొందరికైతే వీడియో కాల్స్ కూడా చేస్తున్నారు. దర్జాగా కేబిన్‌లో పోలీసు అధికారి కూర్చుని ఫోన్‌లో మాట్లాడతారు. 'మా అబ్బాయితో ఒకసారి మాట్లాడించండి సార్' అని అడిగితే.. 'ఎంత ధైర్యం మీకు.. పోలీస్‌కస్టడీలో ఉన్నవాడితో మాట్లాడించాలా?' అని దబాయిస్తారు. ఇలా విదేశాల నుంచి సైబర్ నేరగాళ్లు తిరుపతిలోని దాదాపు 8 మందికి వారం రోజుల వ్యవధిలో వాట్సాప్ కాల్స్ చేసి పోలీసు అధికారులమంటూ డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలు తిరుపతిలోని సైబర్ పోలీసుల దృష్టికి వచ్చినట్లు సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ చెప్పారు. పోలీసు అధికారుల వున్న వాట్సాప్ పిక్ ఫోటోలతో ఎవ్వరూ ఫోన్ చేసి మాట్లాడరని, మోసపోవద్దని ఆయన తెలిపారు. ప్రధానంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్,ఢిల్లీ, ముంబాయి ప్రాంతాల నుంచి మాత్రమే ఇలాంటి కాల్స్ వస్తున్నాయన్నారు.

- తిరుపతి (నేరవిభాగం)

సైబర్ నేరాల బారిన పడద్దు

అపరిచిత కాల్స్ తీయవద్దని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. అపరిచితులతో సోషల్ మీడియాలో స్నేహం చేయవద్దంటున్నారు.ఫేస్‌బుక్ ప్రొఫైల్స్ లాక్ చేసి వుంచాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు ఎవరితోనూ పంచుకోకూడదని, పేటీఎం, బ్యాంకు అకౌంటు వివరాలు చెప్పవద్దని, సిమ్ అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదంటున్నారు. బహుమతులు గెలుచుకున్నారనే వచ్చే ఈ మెయిల్స్ కూడా బోగస్ అని గుర్తించాలంటున్నారు. మీ నెట్ బ్యాంకింగ్‌కు లాగిన్ అవ్వాలని క్రెడిట్, డెబిట్ కార్డు వివరాలు ఎంటర్ చేయమని అడిగితే తప్పకుండా అది మోసం అని గుర్తించండని హెచ్చరిస్తున్నారు.

1930 నెంబరుకి ఫోన్ చేయండి

ఇలాంటి నేరాలు అరికట్టేందుకు, బాధితులు పోగొట్టుకున్న మొత్తం సొమ్మును రాబట్టేందుకు పోలీసు శాఖ ఒక ఏర్పాటు చేసింది. 1930 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేస్తే చాలు.. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా క్షణాల్లో ఆ సమాచారం సైబర్ పోలీసులకు అందుతుంది. మీరు కట్టేసిన డబ్బును ట్రాక్ చేసి తరువాత బ్లాక్ చేసి తిరిగి మీకు దక్కేలా చేస్తారు. దీంతో పాటు సైబర్ బాధితుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెయిల్ ఐడీకి ఫిర్యాదు చేయవచ్చు. **డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీవోవి.ఇన్**కు ఫిర్యాదు చేయవచ్చునని తిరుపతి జిల్లా సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. అవసరమైతే తన నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని ఆయన తెలిపారు. వినోద్ కుమార్ నెంబర్: 9154141884

గురుకులంలో కలకలం

- విద్యార్థిని కన్పించలేదని వెతుకులాట
- హాస్టల్ గదిలోనే వున్నట్లు గుర్తింపు

సూళ్లూరుపేట, జూలై 22 : ఓ విద్యార్థిని అదృశ్యమై కొద్ది గంటలకే నిద్రిస్తూ కనిపించిన వైనం కలకలం రేపింది. సూళ్లూరుపేటలోని అంబేద్కర్ గురుకులంలో పదో తరగతి విద్యార్థిని అదృశమైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గురు ప్రసూన సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటలకు సదరు విద్యార్థిని క్లాసు ప్రారంభంలో కనిపించింది. 10.50గంటలకు విరామ సమయంలో వెళ్లిన విద్యార్థిని 11 గంటలకు తరగతి గదిలో కనిపించలేదు. సిబ్బంది ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో పాఠశాలలో విస్తృతంగా గాలించారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలిక స్వగ్రామంలోని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థులెవరూ బయటకు వెళ్లలేదని గేట్ వాచ్‌మన్ పోలీసులకు చెప్పాడు. అనుమానంతో హాస్టల్ గదులను పరిశీలించారు. ఆ విద్యార్థిని ఓ గదిలో నిద్రిస్తున్నట్లు గుర్తించారు. బాలికను విచారించారు. సాంఘిక సంక్షేమ గురుకుల డీసీవో పద్మజ రాత్రి పాఠశాలను తనిఖీ చేశారు.



వద్దిగుంటకండ్రిగలో సిద్ధమైన లేఅవుట్

విలువైన ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

లేఅవుట్ సిద్ధం చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పట్టించుకోని అధికార యంత్రాంగం

చెరువును చెరబట్టి లేఅవుట్లు

నాయుడుపేట, జూలై 22 : అధికారం అడ్డం పెట్టుకుని గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ వారు సాగించిన అక్రమాలకు అంతూపొంతూ లేకుండా పోయింది. తాజాగా ఓ చెరువు భూమిని సైతం ఆక్రమించేసి లేఅవుట్‌కు సిద్ధం చేసిన వైనమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. వివరాలివి.. నాయుడుపేట మండలంలో మేనకూరు సెజ్ వల్ల అనేక భారీ, మధ్యతరహా, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అందులో వేలాది మందికి ఉపాధి దొరికింది. ఫలితంగా ఈ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. ఎకరా కోట్లాది రూపాయల విలువ పలుకుతోంది. దీంతో ధనదాహం మరిగిన వైసీపీ కార్యకర్తలు ఇక్కడి భూమిపై కన్నేశారు. మేనకూరు పంచాయతీలోని వద్దిగుంట కండ్రిగ నాయుడుపేట - వెంకటగిరి రహదారి వద్ద చిన్న చెరువుకు సంబంధించి సర్వే నెం.189లో 1.80 ఎకరాల చెరువు భూమి ఉంది. ఈ చెరువులో దాదాపు 65-70 సెంట్లలో వైసీపీ కార్యకర్తలు మట్టితోలి చదును చేశారు. పక్కనే ఉన్న దాదాపు 3.5 ఎకరాల పట్టాభూమితోపాటు చెరువుభూమిని కలిపి లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. దీనిపై ఆంధ్రజ్యోతి ఇరిగేషన్ ఏఈ వీరాస్వామిని వివరణ కోరగా... తమ శాఖకు ఇచ్చిన జాబితాలో వద్దిగుంటకండ్రిగకు చెందిన చిన్నచెరువు లేదన్నారు. అయినప్పటికీ సర్వే చేయించి ఆక్రమణపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ కల్యాణి వివరణ కోరగా... వద్దిగుంట కండ్రిగ చిన్న చెరువు ఆక్రమణ, అక్రమ లేఅవుట్‌పై పంచాయతీ వీఆర్వోను పంపిస్తానని తెలిపారు.



చదునుచేసి మట్టితోలిన చిన్నచెరువు

పరిహారమా.. పరిహాసమా?

- మార్చిలో బటన్ నొక్కినా జమకాని ఇన్‌పుట్ సబ్సిడీ
- ఎన్నికల ముందు కోడ్ పేరిట జగన్ నాటకం
- ఇప్పటికీ అందని తుపాను నష్ట పరిహారం
- కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు

గూడూరు అర్బన్, జూలై 22: ఎటు చూసినా కూలిన చెట్లు... మునిగిన పైర్లు... నేలంతా నీరు... కర్షకుల కంట కన్నీరు...గతేడాది డిసెంబరులో ప్రకృతి ప్రకోపించి మిచాంగ్ తుపాను రూపంలో చేసిన బాభత్సానికి ఊళ్లకు ఊళ్లే చిగురుటాకుల్లా వణికిపోయాయి. తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 5168 మంది రైతులకు చెందిన 1423.38 హెక్టార్లలోని పంట 33శాతం కంటే ఎక్కువగా దెబ్బతింది. నిమ్మ, మామిడి, మిరప, అరటి, కూరగాయలు, తమలపాకులు తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. రూ. 319.63 కోట్ల మేర నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ కింద అందాల్సి ఉందని అప్పట్లో లెక్కతేల్చారు.



తుపానుతో దెబ్బతిన్న అరటిపంట(ఫైల్‌ఫొటో)

మార్చిలో బటన్ డ్రామా..

ఈ ఏడాది మార్చి 6న నాటి సీఎం జగన్ బటన్ నొక్కి రాష్ట్రంలో 11,59,126 మంది తుపాను బాధిత రైతులకు రూ.1294 కోట్ల మేర ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేశామన్నారు. అంతకు ముందు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి కరువు నష్టపరిహారం కూడా విడుదల చేస్తున్నట్లు ప్రకటిచారు. అకౌంట్‌లో డబ్బులు పడ్డాయేమోనని రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జమ కాలేదని తెలుసుకుని విస్తుపోయారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఖాతాల్లో డబ్బులు జమ చేయనీయకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయంటూ సానుభూతి లబ్ధి కోసం జగన్ పాకులాడారు. కోడ్ అమలులో ఉన్నా పోలింగ్ ముందు రోజు రైతుల డబ్బులు వేస్తున్నట్లు నమ్మించారు. నష్టపరిహారం-పెట్టుబడి రాయితీ జమ చేయకుండానే చేతులెత్తేసి జగన్ కుర్చీ దిగిపోయారని రైతులు గ్రహించారు. ఆయన హయంలో సూక్ష్మ సేద్యం, సబ్సిడీ యంత్ర పరికరాలు, విత్తనాలు, మందులు, ఎరువులు తదితర ప్రోత్సాహక పథకాలకు కూడా మంగళం పాడేశారు. క్లిష్ట సమయాల్లో కూడా తమను ఆదుకోలేదని,మోసం చేశారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో పెట్టుబడి రాయితీ, నష్టపరిహారం అందజేస్తుందని వీరంతా ఎదురుచూస్తున్నారు.



రాళ్లకుప్పంలో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

రాళ్లకుప్పంలో ఇరువర్గాల ఘర్షణ

12మంది గ్రామస్తులపై కేసులు

సత్యవేడు, జూలై 22 : సత్యవేడు మండలం రాళ్లకుప్పంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీనిపై విచారించిన పోలీసులు 12 మందిపై కేసు నమోదు చేశారు. ఇరు వర్గాల కథనం మేరకు....రాళ్లకుప్పంలో ఇటీవల జరిగిన జాతరలో పోలేరమ్మ ఊరేగింపు సందర్భంగా చిన్న పాటి వివాదం మొదలైంది. గ్రామానికి చెందిన రమేష్ స్థానిక పెట్రోల్ బంక్ సమీపంలో ఇటీవల ఇల్లు కట్టుకున్నాడు. పోలేరమ్మ ఊరేగింపు సందర్భంగా తమ ఇంటివరకూ తీసుకు రావాలని రమేష్ కోరారు. అయితే రమేష్ ఇల్లు గ్రామ పొలిమేరకు అవతల ఉందని, కాబట్టి పోలేరమ్మను ఇంటివరకు తీసుకురావడం కుదరదని జాతర నిర్వాహకులు చెప్పారు. దీంతో వివాదం చిలికి చిలికి గాలి వానలా మారింది. పెద్దలు జోక్యం చేసుకోవడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. అయితే పూర్తిగా సమసిపోకుండా వివాదాలకు ఆజ్యం పోస్తూ తరచూ గ్రామంలో గొడవలు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం రమేష్, దామోదరం మధ్య ఘర్షణలు జరిగాయి. విషయం తెలుసుకున్న శ్రీసిటీ పోలీసులు గ్రామానికి చేకురుని రెండు వర్గాలను శాంతింపజేశారు.మళ్లీ సోమవారం ఉదయం గ్రామంలో ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఇరువర్గాలూ బాహాబాహీకి దిగడంతో గ్రామంలో భయానక వాతావరం నెలకొంది.ఇరువర్గాలూ కత్తులు, కర్రలతో స్వైరవిహారం చేయడంతో మహిళలు , పిల్లలు భయంతో వణికిపోయారు. ఈ ఘర్షణలో ఇరు వర్గాలకూ చెందిన పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న శ్రీసిటీ సీఐ భాస్కర్, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని ఇరువర్గాలనూ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఘర్షణలను అదుపులోకి తీసుకొచ్చారు.ఇరువర్గాలకు చెందిన రమేష్, శేఖర్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఘర్షణలకు కారణమైన 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.శ్రీసిటీ డీఎస్పీ ఫైడేశ్వర్రావు ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

లోయలో పడ్డ లారీ

క్లీనర్ మృతి, డ్రైవర్ పరిస్థితి విషమం

లారీ ఢీకొనడంతో లోయలోకి జారిపోయిన లగేజీ ఆటో, కారు

చంద్రగిరి, జూలై 22 : భాకరాపేట ఘాట్ రోడ్డులో ఓ లారీ అదుపు తప్పి ముందు వెళుతున్న లగేజీ ఆటోను, కారును ఢీ కొని 20 అడుగుల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ తీవ్ర గాయాలపాలయ్యాడు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, లగేజీ ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.... మధ్యప్రదేశ్ నుంచి ముగ్గుపిండి లోడుతో ఓ లారీ తిరుపతికి వస్తుండగా, మార్గమధ్యంలోని భాకరాపేట ఘాట్ రోడ్డులోకి రాగానే లారీ అదుపు తప్పింది. ముందు వెళుతున్న టమోటా లగేజీ ఆటోను, ఓ కారును ఢీ కొని 20 అడుగుల లోయలోకి బోల్తా పడింది. కారు 30అడుగుల లోయలో పడింది. ఈ ప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, అందులోని క్లీనర్ అల్తాఫ్(30) అక్కడికక్కడే మృతి చెందగా, డ్రైవర్ అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ధర్మవరానికి చెందిన బాలమురళీకృష్ణతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.లగేజీ ఆటోలో వస్తున్న భార్యాభర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. చంద్రగిరి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లారీ కింద పడి మృతి చెందిన క్లీనర్ అల్తాఫ్‌ను బయటకు తీశారు. మృతుడు మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



లోయలో పడి నుజ్జునుజ్జయిన లారీ





లోయలో దెబ్బతిన్న కారు, లగేజీ ఆటో

తిరుపతిలో డీజీపీ



తిరుపతి(నేరవిభాగం), జూలై 22: డీజీపీ ద్వారకా తిరుమల రావు తిరుపతి వచ్చారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై విచారణ నిమిత్తం వచ్చిన ఆయన అక్కడినుంచి సోమవారం రాత్రి కారులో బయలుదేరి తిరుపతికి చేరుకున్నారు. పోలీసు అతిథి గృహంలో బస చేశారు.

బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కౌన్సెలింగ్ నేడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 22: పద్మావతి యూనివర్సిటీలో బీటెక్ డ్యూయెల్ డిగ్రీ కోర్సులో ప్రవేశానికి కౌన్సెలింగ్ నేడు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు సావేరి హాల్లో కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు మూడేళ్ళు పద్మావతి యూనివర్సిటీలోనూ, చివరి ఏడాది స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోనూ చదువుకునే అవకాశం కలుగుతుంది. ఇంటర్‌లో 70 శాతం మార్కులు కలిగి ఆసక్తి ఉన్న విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చు. సమగ్ర సమాచారం కోసం.. 79959 73878 నెంబరులో సంప్రదించవచ్చని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని సూచించారు.

కరెంట్ బిల్లులు ఫోన్‌తో ఇలా కట్టేద్దాం

క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వస్తే ఇంకా సులభం

● వెబ్‌సైట్ ద్వారా ఇలా..



ఎస్పీడీసీఎల్‌కి చెందిన www.apspdcl.in ఓపెన్ చేసి, అందులో పే బిల్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత డిటిజల్ పేమెంట్ గేట్‌వే కింద మూడు ఆప్షన్లు బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, టీఏ (ట్రాన్సాక్షన్ అస్యూర్) కనిపిస్తాయి. వీటిల్లో మీకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఎంపిక చేసుకోవచ్చు. తర్వాత మీ మీటరు నెంబరు ఎంటర్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు.

ఇదివరకు కరెంటు బిల్లు చెల్లించాలంటే విద్యుత్ కార్యాలయాల వద్దకెళ్లి కట్టేవాళ్లు. ఆ తర్వాత ఆన్‌లైన్, అనంతరం డిజిటల్ పేమెంట్స్ వచ్చాయి. తాజాగా ఇటీవల గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపులు నిలిపివేసిన విషయం తెలిసిందే. ఈనెల ఒకటో తేదీనుంచి కొత్త ఆర్బీఐ నిబంధనలు అమల్లోకి వచ్చిన నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇకపై ఏపీఎస్పీడీసీఎల్ అధికారిక వెబ్‌సైట్ www.apspdcl.in లేదా దానికి సంబంధించిన యాప్ ద్వారానే చెల్లించాలి. ఇటీవల కాలంలో ఫోన్‌పే, గూగుల్ పేలో కరెంటు బిల్లులు చెల్లించడానికి అలవాటు పడిన వినియోగదారులు ఇప్పుడు వాటికి బ్రేక్ వేయడంతో కొంత గందరగోళంలో పడ్డారు. ఫోన్‌పే, గూగుల్ పేలో చెల్లింపులు సులభంగా ఉండడంతోపాటు నెలవారీ బిల్లును రిమైండ్ చేస్తుంది కూడా. ఒక్క క్లిక్‌తో బిల్లు కట్టేయచ్చు. ఇపుడు ఆ అవకాశం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. అయితే పక్కరాష్ట్రమైన తెలంగాణలో బిల్లుకింద ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే డెబిట్, క్రెడిట్ కార్డులు, యూపీఐ, నెట్‌బ్యాంకింగ్ తదితర విధానాల్లో బిల్లులు చెల్లించేలా అక్కడ విద్యుత్ సంస్థ పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొచ్చింది. అక్కడొచ్చే ఫలితాల ఆధారంగా మనదగ్గర కూడాఈవిధానాన్ని అమలు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

●ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేనివారు..

ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేని వారు మీ దగ్గరలోని విద్యుత్ కార్యాలయం కానీ, సచివాలయం, మీసేవ కేంద్రానికి వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● యాప్‌తో ఇలా..



మీఫోన్‌లో ఎస్పీడీసీఎల్ కన్స్యూమర్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. రిజిస్టర్ మొబైల్ నెంబరు ద్వారా లింకైన విద్యుత్ మీటర్ నెంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అందులోని 'బిల్ పే' ఆప్షన్ ద్వారా మీ ఫోన్‌లో ఉండే ఫోన్ పే, గూగుల్ పే తదితర థర్డ్ పార్టీ యాప్‌లతోపాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా కూడా బిల్లు కట్టేయవచ్చు. ఈ యాప్‌లోనే పేమెంట్ హిస్టరీ, ఏ నెలలో ఎన్ని యూనిట్లు వినియోగించిందీ తెలిసిపోతుంది. అదేవిధంగా కొత్త మీటరు కనెక్షన్ కావాలన్నా ఈ యాప్‌లోనుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

సేంద్రియ సాగుతో మోడల్ న్యూట్రీ గార్డెన్



విత్తనాలు నాటుతున్న అధికారులు

బాలాయపల్లి,జూలై22: స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల కింద మోడల్ న్యూట్రీ గార్డెన్ ఏర్పాటుకు సేంద్రియ సిబ్బంది,వెలుగు, ఉపాధి హామీ పథకం ఏపీఓలు సోమవారం విత్తనాలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ పండ్ల మొక్కల ఫలసాయం వల్ల ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మృత్యుంజయరావు,ఇన్‌చార్జి ఏపీఎం శ్రీను,హెచ్ సీసీమమత తదితరులు పాల్గొన్నారు.

సాగుచేసుకునేలా చర్యలు తీసుకోవాలని వినతి



తహసీల్దారును కలిసిన గిరిజనులు

బాలాయపల్లి, జూలై22: ప్రభుత్వం ఇచ్చిన భూమిలో సాగును అడ్డుకుంటున్నారంటూ పెరిమిడికి చెందిన 20 కుటుంబాలు సోమవారం తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2005లో 0.97 సెంట్ల చొప్పున ప్రభుత్వం తమకు సీజేఎఫ్ఎస్ పట్టాలు అందజేసిందన్నారు. సాగుకు మూడు బోర్లు కూడా మంజూరు చేసిందన్నారు. అయితే గ్రామంలోని కొందరు తమ భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వారు అటవీశాఖాధికారులను పంపి సాగు చేసుకోనీయడం లేదన్నారు. తమకు ఈ అడ్డంకులు తొలగించాలని కోరారు.

ఏబీవీపీ సభ్యత్వ నమోదుకు శ్రీకారం



మాట్లాడుతున్న చందు

నాయుడుపేట, జూలై 22 :స్థానిక వేమ కళాశాలలో సోమవారం ఏబీవీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చెందు విద్యార్థులతో మాట్లాడారు. నలుగురు సభ్యులతో ఏర్పాటైన ఏబీవీపీ నేడు దేశవ్యాప్తంగా విస్తరించిందన్నారు. విద్యార్థుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. దేశభక్తిభావం పెంపొందిస్తుందన్నారు. ఏబీవీపీ నాయకులు వినయ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



గూడూరు, జూలై 22: చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్వర్ణాంధ్రభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ నవ కోటినాయుడు అన్నారు. స్థానిక మాళవ్యానగర్‌లోని తమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఇండియన్ ఒలంపియాడ్ అకాడమి సైన్స్ రెండో దశ పోటీలకు అర్హత సాధించారని ఆయన చెప్పారు. సోమవారం వారికి సర్టిఫికేట్లును అందజేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సునీల్‌రాజ్, హరికృష్ణ, సంధ్యా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా సాయిబాబాకు నగరోత్సవం

నాయుడుపేట టౌన్, జూలై 22 : తగ్రహారపేటలోని షిరిడీసాయిబాబా నగరోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గురుపూర్ణిమ ఉత్సవాలు చివరి రోజు రాత్రి ఆలయం నుంచి ప్రత్యేక పుష్పాలంకరణతో మంగళవాయిద్యాల నడుమ సాయిబాబాను నగరోత్సవంలో ఊరేగించారు. ముందుగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి పూనాటి తిరుమలనాయుడు, కార్యదర్శి చింతపూడి శ్రీధర్‌కుమార్, ఉపాధ్యక్షుడు ముత్యాలురెడ్డి, లోకేష్‌రెడ్డి, రఫీ, రమేష్ సిద్దయ్య, వెంకటేశ్వరరావు, పసుపులేటి రాజాబాబు, రామచంద్రారెడ్డి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ సాయిలక్ష్మి

పెళ్లకూరు, జూలై 22 : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత శిశు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ సాయిలక్ష్మి అన్నారు. సోమవారం పెళ్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యి రోజుల సంరక్షణ కార్యక్రమంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరి జీవితంలో మొదటి 1000 రోజులు ముఖ్యమైనవన్నారు. ఈ రోజుల్లోనే చిన్నారులలో శారీరక, మానసిక పెరుగుదల చాలా వేగంగా ఉంటుందన్నారు. ఈ రోజులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అందించాల్సిన ఆహారంపై తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బుజ్జమ్మ, మల్లెమ్మ, హేమలత తదితరులు ఉన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మత్స్యకారుల సమస్య పరిష్కరించాలి: ఎంపీ



తడ, జూలై 22 : పులికాట్ తీరప్రాంత మత్స్యకారుల సమస్యను పరిష్కరించాలని ఎంపీ మద్దెల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మత్స్యకార సమస్యలను ప్రస్తావించారు. 20వేల మంది మత్స్యకారులు ఈ సరస్సుపై ఆధారపడ్డారన్నారు. తమ జిల్లాకు చెందిన మత్స్యకారులు 5 హెచ్‌పీ సామర్థ్యం ఇంజన్లను వేటకు వాడుతుంటే తమిళనాడు మత్స్యకారులు 400, 500 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన భారీ పడవలతో వేటాడుతున్నారన్నారు. తమ జిల్లా మత్స్యకారుల పడవలను వలలను వారు ధ్వంసం చేస్తున్నారన్నారు. దాడులకు కూడా దిగుతున్నారన్నారు. రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన ఈ సమస్యపై కేంద్రం జోక్యం చేసుకోవాలని ఎంపీ కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ర్యాలీ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీడీపీవో, సూపర్ వైజర్లు

కోట, జూలై 22 :బాల్య వివాహాలను అవగాహనతో నిర్మూలించాలని సీడీపీవో మునికుమారి పిలుపునిచ్చారు. ఆకుతోటదిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లోని తల్లులు, గర్భిణులు దీనికి హాజరయ్యారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను ఆమె వివరించారు. తరువాత ఆకుతోటదిబ్బలో ర్యాలీ నిర్వహించారు. సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కృష్ణమ్మ, కవిత పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.99 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 75,963 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,956 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలేశుడి సేవలో సుజయనిధితీర్థ స్వామి

తిరుమల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాదరాజ మఠాధిపతి సుజయనిధి తీర్థ స్వామి సోమవారం పెద్దమర్యాదతో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం ముందున్న అఖిలాండం వద్దకు చేరుకున్న స్వామికి టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం వెళ్లి శఠగోపం సమర్పించి ఇస్తికాఫల్(ఆలయ మర్యాద) స్వాగతం పలికారు. శిష్యబృందంతో సుజయనిధితీర్థ స్వామి ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత మూలమూర్తిని దర్శించుకున్నారు.

బాలల పురస్కారాలకు దరఖాస్తులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లాలోని వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన 5 నుంచి 18ఏళ్లలోపు వయసు కలిగిన బాలల నుంచి జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయలక్ష్మి తెలిపారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణం, విద్య, ధైర్యసాహసాలు, క్రీడలు, కళలు, సాహిత్యం, సంస్కృతి, సంగీతం, నృత్యం, పెయిటింగ్, నూతన ఆవిష్కరణలు వంటి అంశాల్లో ప్రతిభ కనబరచిన బాలలు ఈ నెల 31లోపు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన బాలలకు రాష్ట్రపతి చేతుల మీదుగా జనవరి-2025లో బహుమతితో పాటు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేస్తారని తెలిపారు.

మునుగుడాకు..తరలింపునకు సాకు

● పూజల కోసమంటూ కూలీల వాదనపై అనుమానాలు



మునుగుడాకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న కూలీలు

వెంకటగిరి, జూలై 22 : వెలుగొండ అడవులు కేంద్రంగా మునుగుడాకును స్మగ్లింగ్ చేస్తూ కొందరు అక్రమార్కులు భారీగా సంపాదిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ళకు మరిగిన అటవీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వెలుగొండ అడవుల్లో అరుదుగా లభించే మునుగుడాకుకు ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా డిమాండ్ ఉంది. మారేడు ఆకును పోలి ఉండటంతో దీనిని ప్రముఖ ఆలయాల్లో పూజలకు ఉపయోగిస్తున్నారని సమాచారం. బీడీ తయారీలో కూడా ఉపయోగిస్తున్నారు. ఆయుర్వేద మందుల తయారీకి వాడుతున్నట్లు చెబుతున్నారు. కొందరు చెన్నైలోని కెమికల్ ఫ్యాక్టరీకి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆకుమాటున విలువైన ఎర్రచందనం దుంగలు తరలిస్తున్నారన్న స్థానికంగా కొండ దిగువ గ్రామాల వారు ఆరోపిస్తున్నారు. చెట్లు నరికి ఆకును బస్తాల ద్వారా తరలిస్తున్నారు. బస్తాల మాటున ఎర్రచందనం కూడా తరలిపోతుందని తెలిసింది. శ్రీకాళహస్తిలోని ఆలయ పూజలకు తీసుకు వెళుతున్నామని కూలీలు చెబుతున్న తీరుపై స్థానికంగా పలు సందేహాలు కలుగుతున్నాయి. బస్తా ఆకు ధర రూ. 100 పలుకుతుందనే వీరి వాదన విశ్వసనీయంగా లేదంటున్నారు.. రోజుల తరబడి అడవుల్లో వుంటూ ఆకును సేకరిస్తున్నారంటే ఎంత గిట్టుబాటవుతుందో అర్థం చేసుకోవచ్చు. అటవీ అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి మరీ ఈ ఆకుకు తరలిస్తున్నారంటే గిరాకీ తెలుసుకోవచ్చు. అటవీశాఖ అధికారులను వివరణ కోరగా పూజల కోసమే అడవుల్లో మునుగుడాకు సేకరిస్తున్నట్లు చెప్పారు. చెట్ల నరికి వేత వల్ల అడవులు అంతరించి పోయే ప్రమాదమున్నా పట్టించుకోక పోవడంపై అధికారుల తీరును గ్రామస్తులు తప్పుబడుతున్నారు.

సాయంత్రమైతే దోమలు బాబోయ్ దోమలు

బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు



మిషన్‌తో ఫాగింగ్ (ఫైల్‌ఫొటో)



మురుగునీటిపై దోమలు

గూడూరు, జూలై 22: పట్టణవాసులను కొద్దిరోజులుగా దోమలతో సతమతమవుతున్నారు. సాయంత్రమైతే అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. అడపాదడపా వర్షాలు పడుతుండడంతో పలు ప్రాంతాల రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. మురుగునీరు నిల్వ చేరుతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను వేయడం కానీ, స్ప్రేయర్ల ద్వారా పిచికారి చేయడం గానీ చేపట్టలేదు. మోటార్ల స్ప్రేయర్లు అందుబాటులో ఉన్నా వినియోగించడం లేదనే విమర్శలున్నాయి. నామమాత్రంగా వాహనాలకు ఫాగింగ్ మిషన్‌లను ఏర్పాటు చేసి పిచికారి చేస్తుండడంతో ఆశించిన ఫలితం దక్కడంలేదు. దుర్గాటినగర్, సనత్‌నగర్, ఐసీఎస్‌రోడ్డు, వరదానగర్, ఇందిరానగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల ప్రజలు అవస్థలుపడుతున్నారు. దోమకాటుకు గురైన వారు జ్వరాలతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వారానికి రెండు రోజులు ఫాగింగ్ మిషన్ ద్వారా పిచికారి చేస్తున్నా ఫలితం ఉండటంలేదని ఆందోళన చెందుతున్నారు.

టీచర్ వైద్యానికి ఆర్థిక సాయం చేయండి : ఎస్టీయూ



కలెక్టర్ వెంకటేశ్వర్‌తో ఎస్టీయూ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: జిల్లా ఎస్టీయూ నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల విధుల్లో తీవ్ర అస్వస్థతకు గురయిన బుచ్చినాయుడుకండ్రిగ మండలం చిన్నాయగుంటకు చెందిన సుమన్‌రావు అనే ఉపాధ్యాయుడి వైద్యానికి అధిక మొత్తంలో వైద్య ఖర్చయిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయనకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ నాయకులు గాజుల నాగేశ్వరరావు, ధనంజయనాయుడు, రమేష్, జగన్నాధం, కటారి మోహన్‌రెడ్డి, దేవేంద్ర, రామాంజనేయులు, గురుప్రసాద్, వేణు, వాసు, రేణుకాదేవి, దాక్షాయణి, రమాదేవి, మునికృష్ణ, మురళికృష్ణ, గుమ్మడి మురళి, మునిశేఖర్, హరిబాబు, మధుసూదన్, రమేష్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుట్టాలమ్మ గ్రామోత్సవం



కోట, జూలై 22 : చెందోడులో సోమవారం పుట్టాలమ్మ గ్రామోత్సవం జరిగింది. దీంతో మూడు రోజులపాటు జరిగిన అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మేళతాళాలతో పుట్టాలమ్మ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాక అవస్థలు

అధిక చార్జీలతో ఆటోల్లో ప్రయాణం



ఆటోలో ప్రయాణిస్తున్న గ్రామస్థులు

చిల్లకూరు, జూలై 17: మండలంలోని పలు గ్రామాలకు ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో గ్రామీణులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా విద్యార్థులు, పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ఓడూరు, రెట్టపల్లి, పున్నపువారిపాళెం, తిమ్మనగారిపాళెం, తీపనూరు తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. తిప్పగుంటపాళేనికికి బస్సు వెళ్తున్నా విద్యార్థులకు అనుకూల సమయంలో తిరగడం లేదు. దీంతో విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. అదేవిధంగా ఓడూరు, రెట్టపల్లి, తిమ్మనగారి పాళెం గ్రామాలకు చెందిన వారు కూడా తమ గ్రామాలకు బస్సులు రావడంలేద ంటున్నారు. బస్సులు గ్రామాలకు రాకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన వారు అధిక చార్జీలతో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని మహిళ మృతి

సత్యవేడు, జూలై 22: టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన సత్యవేడులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వీరాంజనేయులు కథనం మేరకు... పట్టణంలోని ఉలవచేను కాలనీలో నివాసం ఉంటున్న ప్రేమనాధ్ తమిళనాడు ఆర్టీసీలో కండెక్టర్‌గా పని చేస్తున్నారు. సోమవారం భార్య ఉమాతో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వెళ్లారు. తిరిగి ఇంటికి వెళుతుండగా స్టేట్ బ్యాంకు సమీపంలో వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంలో వెనుక కూర్చొన్న ఉమ(31)కి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవరుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్జీలతో కదిలొచ్చారు..



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 22: ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థలో ప్రజలు తెలిపే సమస్యలకు అధికారులు సత్వరమే పరిష్కారమార్గాలు చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అర్జీలపై నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి 665 అర్జీలు వచ్చాయని, అందులో 285 పరిష్కారమైనట్లు కలెక్టర్ తెలిపారు. మిగిలిన అర్జీలు పలు దశల్లో ఉన్నాయని, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్‌కు ఎక్కువగా వచ్చాయన్నారు. అర్జీదారుల కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇదిలా ఉంటే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 146 అర్జీలు ప్రజల నుంచి వచ్చాయని, భూసమస్యలపై అత్యధికంగా రెవెన్యూశాఖకు 112 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వచ్చిన కొంతమంది అధికారులు మాత్రం సెల్‌ఫోన్ చూస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు మురళి, దేవేంద్రరెడ్డి, ఏవో జయరాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కాలువల తీరుపై అన్నదాత కలవరం



పొలాల మధ్య రూపు కోల్పోయిన పంట కాలువ

ఓజిలి, జూలై 22 : దెబ్బతిన్న పంట కాలువలు గుదిబండగా తయారయ్యాయని రైతులు వాపోతున్నారు. మండలంలో 8వేల ఎకరాల్లో చెరువుల కింద వరి సాగు చేస్తున్నారు. చెరువులకు నీరు చేరితేనే సాగవుతుంది. పంట కాలువలు అస్తవ్యస్థంగా ఉండటంతో చెరువులకు నీరు చేరడంలేదు. ఏటా సాగు నీరు వృధా అవుతోంది. ఓజిలి, మానమాల, కురుగొండ, కొండవల్లిపాడు, పార్లపల్లి, వెంకటరెడ్డిపాళెం, వాకాటివారికండ్రిగ, అరిమేనిపాడు, సగుటూరు, భట్లకనుపూరు, కరబల్లవోలు, ఇనుగుంట, వజ్జావారిపాలెం, పాలెంపాడు, అత్తివరం తదితర గ్రామాలలో చెరువుల కింద సాగు చేపడుతున్నారు. ఆయకట్టు భూములను దుక్కిచేసేందుకు సిద్ధమవుతుంటే కాలువలు ప్రతికూలంగా మారాయి. కాలువలను సరిచేసుకోవడం తలకు మించిన భారంగా మారుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉపాధి నిధులతో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.